RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 323 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

బుధవారం 12, ఏప్రిల్ 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## వ్యవసాయ మీటర్ల కాడ కూడా రాజకీయమే

**మీటర్లు పెట్టలేదని 30వేల కోట్లు ఆపారు: హరీష్**



సంగారెడ్డి,ఏప్రిల్11(ప్రజామంటలు): వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టలేదని తెలంగాణకి వచ్చే రూ.30 వేల కోట్లను కేంద్రం ఆపిందని మంత్రి హరీష్ రావు ఆరోపించారు. సంగారెడ్డి జెడ్పీ మీటింగ్ లో పాల్గొన్న మంత్రి హరీష్ రావు.. పక్కనే ఉన్న ఏపీ రాష్ట్రం మోటర్లకు మీటర్లు పెట్టి డబ్బులు తెచ్చుకుందని వ్యాఖ్యానించారు. రూ.1350 కోట్ల వెనుకబడిన జిల్లాల నిధిని కేంద్రం ఆపిందని విమర్శించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు రావాల్సిన రూ.24 వేల కోట్లను ఇవ్వలేదని మంత్రి ఆగ్రహం

మిగతా... 2లో






## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణలో

# భారీ కుట్ర

- బైలదిల్లా కోసం విశాఖను నష్టాల్లోకి నెట్టారు
- బయ్యారం ఉక్కు సాధ్యం కాదని నివేదిక ఇచ్చారు
- విభజన హామీల్లో కడప, బయ్యారంలను విస్మరించారు
- ఆత్మీయ ఆదానీ కోసం మోడీ వ్యాపార ఎత్తులు
- దమ్ముంటే బైలదిల్లా ఒప్పందాలను రద్దు చేయాలి
- తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసమే విశాఖపై స్టడీ
- మీడియా సమావేశంలో వెల్లడించిన మంత్రి కెటిఆర్
- 25న నియోజకవర్గ స్థాయిలో బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు
- 27న పార్టీ కార్యాలయంలో కెసిఆర్ ఆధ్వర్యంలో సభ

హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యవహారంలో భారీ కుట్ర దాగి ఉందని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తన మిత్రుడు ఆదానీకి లబ్ది చేకూర్చేలా మోడీ వ్యవహారం నడుపుతున్నారని, ఈమేరకు కేంద్రం కుట్ర చేస్తోందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. మంగళవారం ఆయన ఇక్కడ మంతంరి సత్యవతి తదితరులతో కసలి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తే ఉద్యోగులు నష్టపోతారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో.. బీహెచ్ఇఎల్‌కు నేరుగా అధిక ఆర్డర్లు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పేర్కొన్నారు. బీమా పథకాలన్నీ ఎల్ఐసీకి అప్పగించారని, నష్టాలను ప్రజలకు.. లాభాలను నచ్చినవారికి అప్పగించడం.. కేంద్రం ఆలోచనగా కనిపిస్తోందని మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. బైలదిల్లా గనులను ఆదానీకి అప్పగించే క్రమంలో విశాఖను కూడా కట్టబెట్టే ప్రయత్నాల్లో భాగంగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టీర ప్రైవేటీకరణ యత్నాలు సాగుతున్నాయని అన్నారు. సెయిల్ ద్వారా బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ పరిశీలిస్తామని విభజన చట్టంలో కేంద్రం స్పష్టంగా చెప్పిందని మంత్రి కేటీఆర్ అన్నారు. బయ్యారం, కడపలో స్టీల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని.. కేంద్రం హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఎన్నోసార్లు కలిశానని, బైలాదిల్లా నుంచి బయ్యారానికి.. 50 శాతం పైప్‌లైన్ ఖర్చు భరిస్తామని చెప్పామని అన్నారు. 2014 నుంచి బయ్యారం గురించి ప్రశ్నిస్తున్నామని, కేంద్ర మంత్రులను కలిసినా ఎలాంటి లాభం లేదని మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే బయ్యారం వెనుక ఉన్న కుట్రను గుర్తించలేకపోయామని, 2018 సెప్టెంబర్‌లో అదానీ గ్రూప్ బైలదిల్లా ఐరన్ ఓర్ కంపెనీ పెట్టిందని మంత్రి కేటీఆర్ అన్నారు. బైలదిల్లా నుంచి ఐరన్ ఓర్‌ను.. గుజరాత్‌లోని ముంద్రాకు తరలించేలా ప్రణాళిక చేశారని మంత్రి ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కావాలనే నష్టాల్లోకి నెట్టారని, అదానీ కోసమే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. బైలదిల్లా గనులపై అదానీ, కేంద్ర పెద్దల కన్ను పడిందని, నష్టాలను చూపించి దోస్తులకు చౌకగా విక్రయించడం ప్రధాని మోదీ విధానమని అన్నారు. తెలుగు రాష్ట్రాలపై మోదీ చేస్తున్న కుట్రను.. ఎండగట్టేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తోందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో విశాఖ ఉక్కు ప్రైవేటికరణకు కేంద్రం కుట్రలను బహిర్గతం చేస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. నష్టాలను జాతికి అంకితం చేసి లాభాలను నచ్చిన వ్యక్తులకు అప్పగించడమే కేంద్రం ఆలోచనగా కనిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, వాటిని ప్రైవేటికరణ చేస్తే వచ్చే సమస్యలేంటో సీఎం కేసీఆర్ చాలా సార్లు చెప్పారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో బిహెచ్ఇఎల్‌కు నేరుగా అధిక ఆర్డర్లు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ అని గుర్తుచేశారు. విశాఖ స్టీల్ కు, బయ్యారం ఉక్కుకు చాలా వత్యాసం ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు. బండి సంజయ్ ఎప్పుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదని విమర్శించారు. కడప, బయ్యారంలో స్టీల్ ప్లాంట్ పెడతామని విభజన చట్టంలో కేంద్రం హామీ ఇచ్చిందని కేటీఆర్ చెప్పారు. 2014 నుంచి తాము బయ్యారం గురించి ప్రశ్నిస్తున్నామని, కేంద్రమంత్రులను కలిసిన లాభం లేదని చెప్పారు. బయ్యారంలో ఇనుము నాణ్యత లేదని అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. ఆదానీ ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తుందని కేటీఆర్ విమర్శించారు. తెలుగు రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆదానీకి అప్పగిస్తూ కేంద్రం తీసుకున్న బైలదిల్లా పర్మిషన్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏప్రిల్ 27న తెలంగాణ భవన్ లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన పార్టీ జనరల్ బాడీ మీటింగ్ ఉంటుందని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా

మిగతా... 2లో

## నన్ను సస్పెండ్ చేస్తే
# బిఆర్ఎస్‌కే నష్టం

- నాకొచ్చే నష్టం ఏమీ లేదన్న జూపల్లి
- మంత్రి నిరంజన్ తీరుపై మండిపాటు



కొల్లాపూర్,ఏప్రిల్11(ప్రజామంటలు): తనని సస్పెండ్ చేస్తే బీఆర్ఎస్‌కే నష్టమని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సస్పెండ్ చేసినందుకు తనకు సంతోషంగానే ఉందన్నారు. మంగళవారం కొల్లాపూర్ లో తన అనుచరులతో కలిసి ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డిపై జూపల్లి ఫైర్ అయ్యారు. మంత్రి దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. తమ నియోజకవర్గంలో జరిగిన అన్యాయం గురించి ప్రశ్నిస్తే తప్పా అని జూపల్లి ప్రశ్నించారు. పరిపాలన గురించి తాను చాలా సార్లు మాట్లాడానని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సర్పంచ్ లు గోస పడుతున్నారని చెప్పారు. తాను అమ్ముడుపోయే వ్యక్తిని కాదని జూపల్లి స్పష్టం చేశారు. ఇప్పటివరకు తాను అడిగిన ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పలేదన్నారు. సస్పెన్షన్‌తో నా కిరీటం కింద పడలే.. మీ కిరిటమే పడింది అంటూ వ్యాఖ్యలు చేశారు. భావ స్వేచ్ఛ ఉందని.. ఎక్కడ సమావేశం నిర్వహించినా వెళతానని.. అలాగే కొత్తగూడెంకు కూడా వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. తాను అడిగిన ప్రశ్నలకు తప్ప అన్ని విషయాలపై మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడారని అన్నారు. తనను సస్పెండ్ చేశారు కానీ మూడేళ్లుగా తనకు సభ్యత్వం పుస్తకాలే ఇవ్వలేదన్నారు. పార్టీ నుంచి సస్పెండ్‌తో పంజరం నుంచి బయటపడ్డట్టు ఉందన్నారు. మిస్టర్ నిరంజన్ రెడ్డి.. 88 స్థానాలు వచ్చినంక మనం మొనగాళ్ళమే కదా.. ఏం అవసరం ఉందని.. 12 మందిని చేర్చు కున్నారు.. ప్రశ్నించే గొంతు వద్దనా.. లేక తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ముంచాలనా.. నేను 2001లో కరెంట్ బిల్లులు కట్టమని.. ఫ్రీ కరెంట్ ఇవ్వాలని పాదయాత్ర చేసిన.. జైల్‌కు వెళ్శిన.. మా ఇంట్లో వైఎస్సార్ ఫోటో అప్పుడు ఉంది.. ఇప్పుడు ఉంది.. ఎప్పుడూ ఉంటది.. సీఎం కేసీఆర్ ఫోటో కూడా ఉంటదని అని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కొల్లపూర్‌లో జూపల్లి.. ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. భారీగా జూపల్లి అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్, జ్యోతిరావుపూలే, తెలంగాణ అమరవీరుల స్థూపాలకు జూపల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ప్రజాస్వామ్య మూలస్తంభాలను
# కూల్చేస్తున్న మోడీ

- విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా



న్యూఢిల్లీ,ఏప్రిల్11(ప్రజామంటలు): ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య మూల స్తంభాలను కేంద్ర ప్రభుత్వం కూలదోస్తోందని మండిపడ్డారు. మౌనం దేశ సమస్యలను పరిష్కరించదనే పేరుతో ఓ వార్తా పత్రిక సంపాదకీయంలో మోదీ సర్కార్‌పై సోనియా విరుచుకుపడ్డారు. కీలక సమస్యలు, సున్నిత అంశాలను వదిలివేయడం లేదా ఘాటైన పద ప్రయోగాలతో ఆయా అంశాల నుంచి పక్కకు తప్పుకోవడం మోదీ ప్రకటనలు ప్రస్ఫుటం చేస్తాయని సోనియా మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలోని మూడు స్తంభాలను ధ్వంసం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక అంశాలు, అదానీ కుంభకోణం, బ్జడెట్ వంటి అంవాలపై చర్చను మరుగునపడేసేందుకు, విపక్షం గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలను అడ్డుకోవడం దారుణమని ఆమె మండిపడ్డారు.

విపక్షాలు సమైక్యంగా ప్రభుత్వంపై పోరాడు తుండటంతో విపక్షాన్ని నిలువరించేందుకు కేంద్రం అసాధారణ చర్యలతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎంపీగా రాహుల్ గాంధీపై అనర్హత వేటుతో పాటు ఆయన ప్రసంగంలోని కొంత భాగాన్ని పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించడాన్ని సోనియా ప్రస్తావించారు. పార్లమెంట్‌లో ఎలాంటి చర్చా చేపట్టకుండా రూ. 45 లక్షల కోట్ల బ్జడెట్‌ను ఆమోదించారని దుయ్యబట్టారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కార్ దుర్వినియోగం చేస్తోందని, ఈడీ, సీబీఐ కేసుల్లో 95 శాతం విపక్ష నేతలపైనే బనాయిస్తున్నారని సోనియా గాంధీ మండిపడ్డారు. కాషాయ పార్టీలో చేరిన నేతలపై కేసులు మాత్రం ఆవిరవు తున్నాయని ఆరోపించారు.

## దేశం కోసం
# జైలుకెళ్లడానికి సిద్ధం

- ప్రజల ఆశిస్సులతోనే జాతీయస్థాయి హోదా
- ఆమ్ ఆద్మీ చీఫ్ అరవింద్ కేజీవ్రాల్



న్యూఢిల్లీ,ఏప్రిల్11(ప్రజామంటలు): స్వల్ప కాలంలోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించడం అద్భుతమని ఆ పార్టీ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ చెప్పారు. దేశంలోని కోట్లాది మంది ప్రజల ఆశలు ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ పట్ల విశ్వాసంగా మారాయన్నారు. ప్రజలు తమకు పెద్ద బాధ్యతను ఇచ్చారని తెలిపారు. దేవుని ఆశీర్వాదంతో ఈ బాధ్యతను నిజాయితీగా నిర్వహిస్తామని చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీకి జాతీయ పార్టీ గుర్తింపును ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కేజీవ్రాల్ సంబరాలు చేసుకున్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

మిగతా... 2లో

## తమిళనాడు ప్రభుత్వానికి
# సుప్రీంలో చుక్కెదురు

**ఆర్ఎస్ఎస్ ర్యాలీలు నిర్వహించుకోవడచ్చు**

న్యూఢిల్లీ,ఏప్రిల్11(ప్రజామంటలు): తమిళనాడులో ఆర్ఎస్ఎస్ ర్యాలీలు నిర్వహించుకునేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ ర్యాలీలు నిర్వహించుకోవచ్చన్న మద్రాసు



హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఎంకే స్టాలిన్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ వి.రామసుబ్ర మణియన్, పంజక్ మిథాల్‌తో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం కొట్టివేసింది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావడం, గాంధీ జయంతిని పురస్కరించుకుని ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతించాలని గత ఏడాది అక్టోబర్‌లో తమిళనాడు ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ కోరింది. అయితే, నిషేధిత 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా' నుంచి దాడుల ముప్పు ఉందంటూ

మిగతా... 2లో

## ప్రజానాడి






# జూపల్లికి డికె అరుణ ఫోన్

**బిజెపిలో చేరాలని సూచన : ఆలోచిస్తానన్న మాజీమంత్రి**

హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు): బీఆర్ఎస్ అధిష్టానంపై విమర్శలు గుప్పించి సస్పెన్షన్‌కు గురైన ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఏ పార్టీలో చేరబోతున్నారు.. చేరితే ఈ ఇద్దరి నేతల రాజకీయ భవితవ్యం ఎలా ఉండబోతోంది..?

మిగతా... 2లో

## ఒక్క దందా చేసినట్లు
# నిరూపిస్తే... తప్పకుంటా..!

**బండి సంజయ్ ఆరోపణలపై సిపి రంగనాథ్**

**కేసులో ఇరుక్కోవడంతోనే ఆక్రోశం అని వ్యాఖ్య**



వరంగల్,ఏప్రిల్11(ప్రజామంటలు): పదో తరగతి పేపర్ మాల్ ప్రాక్టీస్ కేసులో ఇరుక్కున్నామనే ఉక్రోషంతో బీజేపీ నేతలు తనపై ఆరోపణలు చేస్తున్నారని వరంగల్ సీపీ రంగనాథ్ అన్నారు. ఇంతకాలం చేయని ఆరోపణలు ఇప్పుడే ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. తనపై చేసిన ఆరోపణలకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. నిందితులుగా ఉన్న వాళు దర్యాప్తును తప్పు పట్టడం కామన్ అని చెప్పారు. వరంగల్ లో అనేక కేసుల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కూడా అరెస్టు అయ్యారని తెలిపారు. బండి సంజయ్‌ని ఆశ్రయించిన బాధితులు...తన వల్ల కేసుల పాలైన రౌడీలు, భూ కబ్జాదారులు, పీ.డీ యాక్ట్ బాధితులు, ఇతర నేరాలకు పాల్పడిన వారు ఉండవచ్చన్నారు. తాను నల్గొండ, ఖమ్మంతో పాటు..ఏపీలో అనేక ప్రాంతాల్లో డ్యూటీ చేశానని సీపీ రంగనాథ్ తెలిపారు. తాను ఎక్కడ చేసినా ప్రజలు గుర్తు పెట్టుకుంటారన్నారు. తన కెరీర్‌లో ఒక్క దందా చేసినా..సెటిల్ మెంట్ చేసినట్లు నిరూపించినా ఉద్యోగాన్ని వదిలిపెట్టి

మిగతా... 2లో

# కవితకు కాలు ఫ్రాక్చర్

**మూడు వారాలపాటు విశ్రాంతి**



హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత గాయపడ్డారు. కాలుకు ఫ్రాక్చర్ కావడంతో వైద్యుల సూచన మేరకు ఇంట్లో విశ్రాంతి తీసుకోనున్నారు. మూడు వారాల పాటు కవిత రెస్ట్ తీసుకోనున్నారు. ఈ విషయాన్ని కవిత ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. కాలు ఫ్రాక్చర్ కావడంతో మూడు వారాలు విశ్రాంతి తీసుకోవాల్సిందిగా వైద్యుల సూచన. ఎలాంటి సహాయమైనా లేదా సమాచారం కోసం నా ఆఫీసు అందుబాటులో ఉంటుందని అంటూ కవిత ట్వీట్ చేశారు. కవిత గాయపడిన విషయం తెలిసిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కవిత త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు, కార్యకర్తలు రీ ట్వీట్లు చేస్తున్నారు.

# ఒక్క దందా చేసినట్లు నిరూపిస్తే... తప్పుకుంటా..!

**(మొదటి పేజీ తరువాయి)**
వెళ్లిపోతానని సవాల్ విసిరారు. పదో తరగతి పేపర్ మాల్ ప్రాక్టీస్ కేసులో చాలామంది మెసేజ్ పంపారని..వారందరిని విచారణకు పిలుస్తున్నామన్నారు. మీడియా వాళ్ళను కూడా విచారణకు పిలుస్తున్నామని చెప్పారు. తాను రాజకీయాలకు అతీతంగా ఉద్యోగం చేశానని సీపీ రంగనాథ్ తెలిపారు. ఏప్రిల్ 12వ తేదీన వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ప్రజావాణి ఉంటుందని....చాలా మంది న్యాయం కోసం వస్తారని చెప్పారు. తన దగ్గరికి దళారులు రారని...సామాన్యులు.. న్యాయం కోసం నలిగిపోయిన వారే వస్తారన్నారు. సత్యం బాబు కేసుపై బండి సంజయ్ కు పూర్తి అవగాహన లేనట్లుందని చురకలంటించారు. ఆ కేసును దర్యాప్తు చేసింది తాను కాదన్నారు. తాను ప్రమాణం చేసే ఉద్యోగంలోకి వచ్చానని....ప్రతీసారి ప్రమాణం చేయాల్సిన అవసరం లేదన్నారు. చేయమంటే ప్రమాణం చేసేందుకు సిద్ధమన్నారు.

## తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంలో చుక్కెదురు

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ ర్యాలీలకు తమిళనాడు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీంతో మద్రాసు హైకోర్టును ఆర్ఎస్ఎస్ ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు గత ఏడాది నవంబర్‌లో కొన్ని షరతులపై ఆర్ఎస్ఎస్ ర్యాలీలకు అనుమతి ఇచ్చింది. అయితే దీనిపై కూడా ఆర్ఎస్ఎస్ డివిజన్ బెంచ్‌కు వెళ్లడంతో ఎలాంటి షరతులు లేకుండా ర్యాలీలు నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ డివిజన్ బెంచ్ ఈ ఏడాది ఫిబవరి 10న తీర్పు చెప్పింది. దీనిపై స్టాలిన్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ర్యాలీల ను పూర్తిగా తాము వ్యతిరేకిం చడం లేదని, నిఘావర్గాల హెచ్చరికలతోనే వీధి వీధిన ర్యాలీలకు అనుమతించడం లేదని చెప్పింది. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయ స్థానం.. మద్రాసు హైకోర్టు తీర్పును సమర్థిస్తూ స్టాలిన్ సర్కార్ పిటిషన్‌ను మంగళవారంనాడు కొట్టివేసింది. దీంతో తమిళనాడులో ఆర్ఎస్ఎస్ ర్యాలీలు నిర్వహించేందుకు మార్గం సుగమమైంది.

# దేశం కోసం జైలుకెళ్లడానికి సిద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**
పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, జాతి వ్యతిరేక శక్తులతో పోరాడుతున్నం దుకు జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశ ప్రగతిని అడ్డుకోవాలని కోరుకునే దేశ వ్యతిరేక శక్తులంతా ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకమని చెప్పారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జైలులో ఉన్న ఆ పార్టీ నేతలు సత్యేందర్ జైన్, మనీశ్ సిసోడియాలను గుర్తు చేశారు. జైలుకు వెళ్లడానికి భయపడేవారు పార్టీని వదిలిపెట్టాలన్నారు. భారత దేశాన్ని ప్రపంచంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమ పార్టీలో చేరాలని ప్రజలను కోరారు. తమకు దేవుని మద్దతు ఉందన్నారు. నిఖార్సయిన నిజాయితీ, దేశభక్తి, మానవత్వం తమ పార్టీకి మూడు స్తంభాలని చెప్పారు.
కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్సీపీ, సీపీఐ, టీఎంసీ పార్టీలు జాతీయ హోదాను కోల్పోయాయని ప్రకటించింది. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీకి జాతీయ హోదాను ప్రకటించింది. మరోవైపు టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా ప్రకటించిన కేసీఆర్‌కు ఈసీ షాకిచ్చింది. ఏపీలో బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ గుర్తింపును తొలగించింది. బీఆర్ఎస్ తెలంగాణలో మాత్రమే రాష్ట్ర పార్టీగా కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా భారత్‌కు స్వాతంత్ర్యం రాకముందే ఏర్పాటైంది. 1964లో సీపీఐ, సీపీఐ(ఎం) విడిపో యాయి. ఆ తర్వాత సీపీఐ(ఎం) పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళలో అధికారంలోకి రాగలిగింది. అయితే సీపీఐకి మాత్రం కొన్ని రాష్ట్రాల్లోఉనికి ఉంది. సీపీఐ క్రమంగా ప్రాభవం కోల్పోయి చివరకు జాతీయ పార్టీ హోదాను కోల్పోయింది. సీపీఐకి డి.రాజా ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. నారాయణ సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉంది. మమతా బెనర్జీ టీఎంసీ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో సభ్యులున్నా జాతీయ పార్టీ గుర్తింపును కాపాడుకునే స్థాయిలో లేరు. ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీతో పాటు పంజాబ్‌లో అధికారంలో ఉంది. గుజరాత్‌లో తక్కువ సీట్లు వచ్చినా ఓట్ షేర్ గణనీయంగా ఉండటంతో జాతీయ హోదా దక్కింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఆప్‌కు ఉనికి ఉంది.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణలో భారీ కుట్ర

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ నెల 25న నియోజక వర్గ స్థాయి సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డులో ప్రతి డివిజన్‌లో పార్టీ జెండా ఎగురవేసి.. సమావేశం నిర్వహించే బాధ్యత నియోజకవర్గ ఇన్‌ఛార్జిలదే అని మంత్రి కేటీఆర్ మరోసారి సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో పార్టీ అధ్యక్షులు కేసీఆర్ నాయకత్వంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశాల్లో భాగంగా పార్టీ పతాక ఆవిష్కరణ చేసి.. పలు అంశాలపై తీర్మానాలు, చర్చలు జరుపుతామని వెల్లడించారు. 22 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకుని 23వ ఏట పార్టీ అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని అంశాలపై సావధా నంగా చర్చిస్తారని తెలిపారు. తెలంగాణలో జరగబోయే అసెంబ్లీ, పార్ల మెంటు ఎన్నికల సన్నద్ధతపై కూడా చర్చించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయి. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో బహిరంగ సభల స్థాయిలో జరుగుతున్నాయి. వాటిని కూడా మే నెలాఖరు వరకు పొడిగించాం. పార్టీ అన్నిరకాలుగా ఎన్నికలతో పాటు అన్ని పోరాటాలకు సన్నద్ధంగా ఉండాలని.. ఎప్పటి కప్పుడు కార్యకర్తలతో సంభాషణ జరగాలని ఈ ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటుచేశాం. ఇవి చక్కగా జరుగుతున్నాయి. అక్కడక్కడ మా దృష్టికి వచ్చినచిన్న ఇబ్బందులను కరెక్ట్ చేసుకుని ముందుకెళ్తామని తెలిపారు.

**విశాఖపై సింగరేణి అధ్యయనం**

వైజాగ్ స్టీల్ ఎలాంట్‌ను టేకోవర్ చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సింగరేణి జాయింట్ వెంచర్ కింద ఉక్కు పరిశ్రమ టేకోవర్‌పై సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టింది. ఈ క్రమంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ వెళ్లి అక్కడి పరిస్థితులను సమీక్షించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు ముగ్గురు డైరెక్టర్లు మంగళవారం విశాఖకు వెళ్లారు. అక్కడి స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించారు

## వ్యవసాయ మీటర్ల కాడ కూడా రాజకీయమే

**(మొదటి పేజీ తరువాయి)**
వ్యక్తం చేశారు. నీతి ఆయోగ్ ఇవ్వాలని చెప్పినా రూ.1300 కోట్లు కేంద్రం ఇవ్వ లేదంటూ మండిపడ్డారు. రైతుల కోసం కల్లాలు నిర్మిస్తే కేంద్రం డబ్బులు వాపస్ కట్టించుకుందని మంత్రి హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణలో వ్యవసాయానికి కరెంట్ సరిపోవడం లేదని అదనంగా యూనిట్ కి రూ.20 ఇచ్చి విద్యుత్ కోసం నెలకు రూ.1500 కోట్లు చెల్లించి విద్యుత్ తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తున్న ప్రభుత్వం తెలంగాణ అని ఆయన నొక్కి చెప్పారు.

# జూపల్లికి డికె అరుణ ఫోన్

**(మొదటి పేజీ తరువాయి)**
జాతీయ పార్టీలో చేరుతారా..? ఇద్దరు నేతలకు మరేదైనా వ్యూహం ఉందా..? అనే విషయాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ తరుణంలో.. బీఆర్ఎస్ నుంచి వేటు పడ్డ మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు బీజేపీ గాలం వేస్తోంది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ.. స్వయంగా జూపల్లి కృష్ణారావుకి ఫోన్ చేసి మాట్లాడారు. బీజేపీలో చేరాలని ఆహ్వానించారు. దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకుం టానని జూపల్లి కృష్ణారావు బదులిచ్చారు. కార్యకర్తలతో సంప్రదించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటానని స్పష్టంచేశారు. కాగా, డీకే అరుణ, జూపల్లి కృష్ణారావు ఇద్దరిదీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లానే. గతంలో ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలో కలిసి పనిచేశారు. ఆ సమయంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ.. ఒకే జిల్లా అయినప్పటికీ ఇద్దరి మధ్య కోల్డ్‌వార్ నడిచేది. ఎడముఖం పెడముఖంగా ఉండేవారు. జిల్లాలోనూ పార్టీలోనూ ఆధిపత్యం కోసం అనేక ఎత్తుగడలు హీట్ పుట్టించేవి. మారిన రాజకీయ పరిణామాలతో డీకే అరుణ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరితే.. జూపల్లి కృష్ణారావు గులాబీ గూటికి చేరుకున్నారు. గత ఎన్నికల్లో డీకే అరుణ, జూపల్లి కృష్ణారావు ఇద్దరూ ఓడిపోయారు. అరుణ బీజేపీలోనే కొనసాగుతుండగా.. గులాబీ పార్టీలో జూపల్లికి ఎదురుగాలి వీచింది.

# భారత రాజ్యాంగంలో 'ప్రజాస్వామ్య సోషలిజం'

**(నిన్నటి సంచిక తరువాయి)**
20. రోజురోజుకు విస్తరిస్తున్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
1990లో అంబేద్కర్ శత జయంతి ఉత్సవాల సన్నాహంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాలక్రమంలో అందరూ వెనుకబడిపోయారు. అంబేద్కర్ రోజురోజుకు విశ్వరూపంపై వెలుగు కిరణాలు ప్రవేశించాయి. మొట్టమొదటగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి శరద్ పవార్ 1978లో అంబేద్కర్ రచనలన్నిటిని సంకలనాలుగా తీసుకురావడానికి ప్రభుత్వ పరంగా కృషి చేశారు. అలా అంబేద్కర్ కృషి, ప్రసంగాలు, రచనలు విస్తృతంగా ప్రజల్లోకి చొచ్చుకొని వచ్చాయి. తొలుత ఇంగ్లీషులో వచ్చినప్పటికీ క్రమంగా మరాఠీ, హిందీ, తెలుగు తదితర భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఈ సంకలనాలు రాకముందే ఎక్కడికక్కడ ఆయా భాషల్లో అంబేద్కర్ ముఖ్య రచనలు వెలువడుతూ వచ్చాయి. 'కుల నిర్మూలన', 'శూద్రులెవరు?', 'అస్పృశ్యులెవరు?', 'అంబేద్కర్ జీవిత చరిత్ర', 'బుద్ధుడు కారల్ మార్క్స్', 'బౌద్ధం ఉత్థాన పతనాలు' మొదలైనవి వాటిలో కొన్ని. అంబేద్కర్ జీవిత చరిత్ర లక్షలాదిమందిని ఉత్తేజపరిచింది. ధనుంజయ్ కీర్, మహాత్మా జ్యోతిబా పూలే, డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ల జీవిత చరిత్రను రాశారు. ఎండ్లూరి చిన్నయ్య, బొజ్జా విజయభారతి, వసంత మూన్, మధులిమయే మొదలైనవారు అంబేద్కర్ జీవిత చరిత్రను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళారు. అంబడ్కేర్ కృషి పట్ల నిరంతరం అధ్యయనం కొనసాగుతున్నది.



**21. ఈ దేశంలో ప్రధాన సమస్యలు**
ఈ దేశంలో ప్రధాన సమస్య ఓబీసీల సమస్య. మహిళల సమస్య. భూమి సమస్య, పెట్టిబడిదారి దోపిడీ సమస్య, రాజరికాల, భూస్వామ్య వ్యవస్థల సంస్కృతి, సమస్త వివక్షతల, వెలివేతల, అసమానతల సమస్యలే భారతదేశ ప్రధాన సమస్య. అందరికీ కూడు, గుడ్డ, నీడ, సమాన అవకాశాలు, స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం అందుకునే విధంగా అందుకు చేయూతనిచ్చేవిధంగా, రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగం రూపొందించబడింది. రూపొందించడం ఒక ఎత్తు. అది ఆచరణలోకి తెచ్చుకోవడం ఒక ఎత్తు. ఆచరణలోకి తెచ్చుకోవడం కోసం కూడా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇది నిరంతర ప్రక్రియ.

**22. భారత రాజ్యాంగ డ్రాఫ్టు కమిటీ ఛైర్మన్‌గా డా॥ బి.ఆర్. అంబేద్కర్**
భారత రాజ్యాంగ డ్రాఫ్టు కమిటీ ఛైర్మన్‌గా భారత రాజ్యాంగం డా॥ బి.ఆర్. అంబేద్కర్ చేతుల మీదుగా తుదిరూపం తీసుకున్నది. వారి చొరవతో రాజ్యాంగంలో అందరితోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు, మహిళలకు, బాలలకు, అనేక హక్కులు పొందుపరచబడ్డాయి.

23. భారత రాజ్యాంగంలో 'ప్రజాస్వామ్య సోషలిజం'
భారత రాజ్యాంగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, ఇతర సామాజిక వర్గాలకు సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు సాధించడం, స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం, అందరికీ సమాన అవకాశాలు, సమాన అవకాశాలు అందుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, రక్షణలు, భారత రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి. ప్రజాస్వామ్య సోషలిజానికి భారత రాజ్యాంగం హామీ ఇస్తుంది. భారత రాజ్యాంగంలోని ఈ కింది ఆర్టికల్స్ అందుకు హామీ ఇస్తాయి.

1. ఆర్టికల్-12 ప్రాథమిక హక్కులు
2. ఆర్టికల్-14 చట్టం ముందు అందరూ సమానులే
3. ఆర్టికల్-15 సమస్త వివక్షల, అసమానతల నిర్మూలన కోసం
4. ఆర్టికల్-16 ప్రభుత్వోద్యోగ అవకాశాల్లో సమానావకాశాలు
5. ఆర్టికల్-17 అస్పృశ్యత, అంటరానితనం నిషేధం...
6. ఆర్టికల్-19 వాక్స్వాతంత్ర్యం మొదలైన హక్కుల పరిరక్షణ
7. ఆర్టికల్-21ఎ నుండి 22 విద్యను అభ్యసించే హక్కు,
8. ఆర్టికల్-25 నుండి 29 భావ ప్రకటన స్వేచ్ఛ....
9. ఆర్టికల్-36, 37 ఆదేశిక సూత్రాలు
10. ఆర్టికల్-38 ప్రజా సంక్షేమం - సామాజిక వ్యవస్థ
11. ఆర్టికల్-39, 39ఎ ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వ కర్తవ్యాలు
12. ఆర్టికల్-46 ఎస్సీ, ఎస్టీ, బీసీల విద్య, తదితరాలు
13. ఆర్టికల్ 330 : ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు..
14. ఆర్టికల్ 338: జాతీయ ఎస్సీ కమిషన్
15. ఆర్టికల్ 338ఎ: జాతీయ ఎస్టీ కమిషన్
16. ఆర్టికల్ 340 : జాతీయ బీసీ కమిషన్
17. ఆర్టికల్ 341 : షెడ్యూల్డ్ కులాలు
18. ఆర్టికల్ 342 : షెడ్యూల్డ్ తెగలు

24. భారత రాజ్యాంగంలో ప్రత్యేకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఆర్టికల్స్ అన్నీ కలిపి 30-40 పేజీల వరకు ఉంటాయి. ఇదేమి చిన్న విషయమేం కాదు. అదనంగా అందరికి ఉండే హక్కులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు, మహిళలకు కూడా సమానంగా ఉంటాయి. విద్యావంతులకు సైతం రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక ఆర్టికల్స్, రక్షణలు తెలియకపోవడం విచారకరం. ఇందుకు ప్రత్యేకంగా విస్తృత ప్రచారం అవసరం.

**25. ఆర్టికల్ 32 ప్రాథమిక హక్కుల పరిరక్షణ మార్గాలు:**
రాజ్యాంగంలోని ఈ విభాగం ద్వారా ప్రజలకు సంక్రమింప జేయబడిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, సమయోచితమైన రీతిలో సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. రాజ్యాంగం ఈ మేరకు హామీ ఇస్తుంది. డా॥ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో ఈ 32వ ఆర్టికల్ అన్నిటికన్నా ముఖ్యమైనదని అన్నారు. ఈ ఆర్టికల్ ద్వారానే హక్కులన్నిటినీ న్యాయస్థానం ద్వారా సాధించుకోవచ్చు అన్నారు.

26. భారత ప్రభుత్వ చట్టం, 1935
ప్రతి పది సంవత్సరాలకు రాజ్యాంగం సమీక్షించుకోవాలని బ్రిటీష్ ప్రభుత్వంతో కుదిరిన అవగాహనతో 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం బ్రిటీషు పార్లమెంట్ ఆమోద ముద్ర పొంది 1935 ఆగస్టు 2న చట్టంగా రూపొందింది. ఈ చట్టం చాలా విస్తృతమైంది. ఈ చట్టంలో 321 ఆర్టికళ్ళు, 13 షెడ్యూళ్లు ఉన్నాయి. బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ చట్టాలన్నింటిలోను 1935 చట్టం అత్యంత కీలకమైంది. 1935 భారత ప్రభుత్వ చట్టం వివరణాత్మకమైన, విస్తృత శాసనం. ఇందులో 321 ఆర్టికళ్ళు ఉన్నాయి. బ్రిటిషు పాలిత ప్రాంతాలలోనూ, సంస్థలలోనూ, అఖిల భారత సమాఖ్య అనే ఒక నూతన వ్యవస్థను ఈ చట్టం ప్రవేశపెట్టింది. పరిపాలనా అంశాలను 3 జాబితాలుగా విభజించారు. 1935 భారత ప్రభుత్వ చట్టంలో ఇతర సామాజిక వర్గాల రిజర్వేషన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన్లు కూడా చేర్చారు. భారత రాజ్యాంగ చరిత్రలో 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం ఒక స్పష్టమైన ముందడుగు.

**(ఇంకా ఉంది)**

- బి ఎస్ రాములు
బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్
8331966987



## జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాల జోరు

ఊరూవాడా మార్మోగుతున్న డప్పు చప్పుళ్లు
కెసిఆర్ సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష
మళ్లీ తెలంగాణలో బిఆర్ఎస్‌దే అధికారమన్న వేముల

**నిజామాబాద్,ఏప్రిల్11:** పంచాయితీలు మొదలు మండల కేంద్రాల్లో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు హోరెత్తిస్తున్నాయి. ఎన్నికలకు మరో ఆరు నెలల గడువు ఉండడంతో పాటు..ప్రజలను కార్యకర్తలను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు వీటిని కొనసాగిస్తున్నారు. దీంతో నిత్యం డప్పు చప్పుళ్లు, డోలువాయిద్యాలతో పెద్ద ఎత్తున ర్యాలీలు, కళాకారుల



ఆటాపాటలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతున్నారు. జై తెలంగాణ, జైజై కేసీఆర్ అన్న నినాదాలు మార్మోగుతున్నాయి. ఆత్మీయ సమ్మేళ నాలకు పార్టీ శ్రేణులతో పాటు అభిమానులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. కార్య క్రమాలు జరిగే ప్రాంతాలన్నీ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో గులాబీమయ మయ్యాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని బీఆర్ఎస్‌కు తిరుగులేదు.. మళ్లీ గెలుపు ఖాయమన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు నిత్యం ఎక్కడో ఒకచోట కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ సంపదను దోచి ఆదానీ జేబులు నింపుతున్నాడు తప్ప తెలంగాణ రాష్ట్రానికి పైసా ఇవ్వడం లేదని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి ఆరోపించారు.ఇప్పటికే పలు ప్రాంతాల్లో జరిగిన సమ్మేళనాల్లో ఆయన పాల్గొని ఉత్సాహం నింపారు. డప్పుల దరువులు, దూందాం కళాకారుల ఆట పాటలతో ఆత్మీయ సమ్మేళనం అదరహో అనిపించింది. తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై విషం కక్కడమే ప్రధాన ఎజెండాగా ఎంచుకున్నారని మంత్రి వేముల మండి పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ మంతా అమలు చేసి మాట్లాడాలని ఆమె సవాల్ విసిరారు. రైతు మరణిస్తే ఐదులక్షల బీమా ఇస్తున్నామన్నారు. రైతుబీమాను దేశమంతా అమలు చేసి ఐదులక్షలు ఇవ్వాలన్నారు. ప్రజల మధ్యన విద్వేశాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. హిందూ, ముస్లిం, మందిర్ మజీద్ పేరుతో ప్రజల మధ్యన చిచ్చుపెడుతున్నారని అన్నారు. జాతీయ హోదా కల్పించాలని, కాళేశ్వరం ప్రాజెక్కుకు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రధాన మంత్రిని కలిసి విన్నవించినా పైసా ఇవ్వలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అవినీతి గురించి కేసీఆర్ కుటుంబంపై విష ప్రచారం చేయడానికి కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. గ్యాస్ ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు కేంద్రంలో ఉన్న బీజేపీ నాయకులు ఎందుకు తగ్గించడం లేదో ప్రజలు నిలదీయ వలసిన అవసరం ఉందన్నారు. గోదావరి, కృష్ణ నీళ్లను తీసుకొచ్చి మిషన్ భగీరథ ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్న ముఖ్యమంత్రిపై మోదీ ఎందుకు విషయం కక్కుతున్నారని ప్రశ్నించారు.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదన్నారు. తొమ్మిది సంవత్సరాలకు 18కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. నిరంతర విద్యుత్ ఏ రాష్ట్రంలో అమలు చేస్తున్నారో బీజేపీ నాయకులు చెప్పాలన్నారు. కేంద్రం మోటర్లకు మీటర్లు పెడుతామని చెబితే అందుకు ముఖ్య మంత్రి కేసీఆర్ ఒప్పుకోక పోవడం వల్లనే కేంద్రం ముఖ్యమంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనమంటే ఎందుకు కొనలేదో చెప్పాలన్నారు. రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

# కెటిఆర్‌తో ఆదిత్య ఠాక్రే భేటీ

◆ ఇరు నేతల మధ్య పలు అంశాలపై చర్చ

**హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు):** తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ తో మహారాష్ట్ర మాజీ మంత్రి అదిత్య ఠాక్రే భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో టీహబ్ కు వెళ్లిన ఆయన దేశాభివృద్ధిపై పలు అంశాలను కేటీఆర్‌తో పంచుకున్నారు. అలాగే టీహబ్ ప్రత్యేకతను, దాని వివరాలను అదిత్య ఠాక్రేకు కేటీఆర్ వివరించారు. టీ హబ్ పనితీరు, ప్రోత్సహకాల విష యాలను కూడా ఠాక్రే అడిగి తెలుసుకున్నారు. అక్కడే కేంద్ర ప్రభుత్వం పనితీరు, జాతీయ రాజకీయలపై చర్చించారు. ఈనేప థ్యంలో అధిత్య ఠాక్రే.. తాను మంత్రి కేటీఆర్‌ను కలి శానంటు ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. కేటీఆర్‌ను కలవడం అద్భుతంగా, ప్రోత్సహకంగా ఉందని తెలిపారు. స్థిరత్వం, నగరీకరణ, సాంకేతికత విషయాలపై మాట్లాడుకున్నామని.. ఫలితంగా అవి దేశాభివృద్ధికి ఎలా దోహదం చేస్తాయనే అంశాలపై చర్చించామని పేర్కొన్నారు. టీహబ్‌లో స్టార్టప్‌లు, ఆవిష్కర్తలు, ఆలోచనపరుల కోసం అక్కడ జరుగుతున్న అద్భుతమైన పనులను చూశానంటూ రాసుకొచ్చారు.




# అమరుల స్థూపం వద్దకు రండి

## పేపర్ లీకులో ఆధారలు చూపుతా : సిఎం కెసిఆర్‌కు ప్రవీణ్ సవాల్

**హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు):** టిఎస్‌పిఎస్ పేపర్ లీక్ పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలి



బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్ లో ఏర్పాటు చేసిన నిరుద్యోగ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వసీ÷– కమిషన్ పేపర్ ను వ్యాపారంగా మర్చి అమ్ముకున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దమ్ముంటే..అమరవీరుల స్థూపం దగ్గరకు రావాలని.. తాను పేపర్ లీక్ కు సంబంధించిన ఆధారాలతో వస్తానని ప్రవీణ్ కుమార్ సవాల్ చేశారు. గ్రూప్ 1కు సంబంధించిన అన్నీ పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. సిట్ ద్వారా నిరుద్యోగులకు న్యాయం జరగదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రస్తుతం ఉన్న ÷ాఖాఅ బోర్డును ప్రక్షాళన చేయకుండా పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మళ్లీ మళ్లీ మోసం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు, నిరుద్యోగులు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ముఖ్యమంత్రి కేసీఆర్ పేపర్ లీక్ పై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రే దోషి అని ఆరోపించారు. ఈ కేసును సీబీఐతో ఎంక్వైరీ చేయించాలని లేదా సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

# పువ్వాడ నాగేశ్వరరావుకు కెటిఆర్ పరామర్శ

**హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు):** కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పువ్వాడ నాగేశ్వర్ రావును రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం పరామర్శించారు. కేటీఆర్ వెంట నాగేశ్వర్ రావు కుమారుడు, మంత్రి పువ్వాడ అజయ్ ఉన్నారు. కేటీఆర్‌ను చూసిన వెంటనే నాగేశ్వర్ రావు భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పువ్వాడకు అందిస్తున్న చికిత్స వివరాలను మంత్రి కేటీఆర్‌కు వైద్యులు క్షుణ్ణంగా వివరించారు. నాగేశ్వర్ రావు త్వరగా కోలుకోవాలని కేటీఆర్ ఆకాంక్షించారు. హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారి తండ్రి, సీపిఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వర రావుని మంత్రి కేటిఅర్ పరామర్శించారు.



## జ్యోతిరావు పూలే జయంతి

**ఏప్రిల్ 15 న హనుమకొండలో నిరుద్యోగ ర్యాలి, మిలియన్ మార్చ్**

**తరిగొప్పుల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. అనంతరం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ తలపెట్టిన నిరుద్యోగ ర్యాలి మిలియన్ మార్చ్



ఏప్రిల్ 15 న హనుమకొండ లో జరిగే కార్యక్రమానికి మండలంలోని నిరుద్యోగ యువత గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ తరిగొప్పుల మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పబ్బోజు రామ్ బ్రహ్మచారి, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి ప్రతాప్, మండల ఉపాధ్యక్షులు కొన్నె రాజు, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు మూడవత్ రాజు నాయక్, ఇదేగిరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో

## జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు...

**చిగురుమామిడి ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జిల్లా కార్యాలయంలో తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా నాయీబ్రాహ్మణ విద్యార్థి హాస్టల్ వసతి గృహంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది ఈసందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు





హరిప్రసాద్ మాట్లాడుతూ మహాత్మ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీనజన బాంధవుడు, మహిళా విద్యాభివృద్ధికి బాటలు వేసిన విద్యావేత్త శ్రీ మహాత్మా జ్యోతిరావు పూలే అని వారు అన్నారు. వారు ఒక సంఘసంస్కర్తగా మహిళా అభ్యుదయ వాదిగా కుల వివక్ష సామాజిక అంటరానితనాన్ని రూపుమాపడానికి తన శక్తి వంచన లేకుండా పాటుపడినటువంటి మహాత్మా జ్యోతిరావు పూలే అని వారి సేవలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసి వారి ఆశయ సాధనకు కృషి చెయ్యాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిరాల వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరాముల రమేష్, నగర కోశాధికారి శ్రీరాముల రమేష్ (మున్న) ఇతర జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**జనగామ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఎం.ఆర్.పి.ఎస్,



ఎం.ఎస్.పి, వి.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎం.ఆర్.పి.ఎస్ జనగామ జిల్లా కో కన్వీనర్ ఇనుముల అనిల్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎం.ఆర్.పి.ఎస్ జనగామ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ నిజమైన మహాత్ముడు ఎవరైన ఉన్నారా అంటే ఆయన పూలే మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.పి. మండల ఇన్చార్జ్ నిర్మల భాస్కర్ మాదిగ, ఎం.ఎస్.పి. సీనియర్ నాయకులు కొమ్మగళ్ళ కృష్ణ మాదిగ, వి.హెచ్.పి.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నాగేష్ మాదిగ, వి.హెచ్.పి.ఎస్. లింగాల ఘనపూర్ మండల కన్వీనర్ గద్దం సోమరాజు మాదిగ, ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు చెరుపెల్లి కుమార్ మాదిగ, కత్తి రామ్ మాదిగ, కలకుంట్ల ప్రణయ్ మాదిగ, గండి కరుణాకర్ మాదిగ, జోసఫ్ బాబు, సుమన్, సుధాకర్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

# పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి

● **వేలేరు ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్**

**వేలేరు ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని వేలేరు ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ అన్నారు. ఈ సందర్భంగా వేలేరు మండల కేంద్రంలో ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ మహాత్మ జ్యోతిరావు పూలే 196 వ జయంతి వేడుకలను పురస్కరించుకుని వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ అంటరానితనం, అణచి వేత, సామాజిక రుగ్మతలపై పోరుసల్పిన తొలి నాటి యోధుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. సామాజిక ప్రజాస్వామ్యం అనే నినాదాన్ని ఎలుగెత్తి చాటి అటువంటి ప్రజాస్వా మ్యం కోసం కలలుగన్న గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ఆ మహానుభావుడి సేవా నిరతి, అణగారిన వర్గాల పట్ల ఆయనకున్న అవాజ్యమైన ప్రేమాభిమానాలను మననం చేసుకుంటూ ఆ మార్గదర్శికి ప్రణామాలు అర్పిస్తున్నట్లు తెలిపారు. శతాబ్దం కాలం నాడు ఆచార వ్యవహారాలు, కుల వ్యవస్థతో కూడిన ఛాందస భావాలు తీవ్రంగా ఉండేవని, అటువంటి పరిస్థితులలో కాలానికి, సమాజానికి ఎదురెళ్లి సమాజంలో అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, ఐకమత్యం కోసం పాటుపడిన ధీశాలి పూలే అని అభిప్రాయపడ్డారు. ఆడబిడ్డలకు చదువు ఎంతో ముఖ్యమని నమ్మి వారి విద్యాభివృద్ధికి అహరహం శ్రమించిన గొప్ప సంస్కర్త అని, వితంతువుల బిడ్డలు అనాథలు కాకూడదని నమ్మి వారికి అండగా నిలబడిన నిస్వార్ధ సేవకుడు అని కొనియాడారు. పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించారు. వారు వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభించిన మొట్టమొదటి భారతీయులలో ఈ దంపతులు వున్నారని, పూలు అమ్మే చిరు వ్యాపారిగా జీవితం ప్రారంభించి రచయితగా, తొలితరం స్వతంత్ర యోధునిగా, కార్మిక ఉద్యమ నేతగా, రైతు బాంధవునిగా ఆయన ప్రజాజీవితం అజరామరం అని సద్దాం హుస్సేన్ కొనియాడారు. నేటి రాజకీయ పక్షాలు సైతం ఆయన చూపిన సామాజిక న్యాయం, సామాజిక ప్రభుత్వం అనే మార్గంలో పయనించడం ఆయన దార్శనికతకు, ముందు చూపునకు తార్కాణమన్నారు. మూల సిద్ధాంతాలలో ఒకటైన



కులాలను కలిపే ఆలోచనా విధానం' జ్యోతిరావు పూలే ఆలోచనలకు దగ్గరగా ఉండే సూత్రం అని, ఆ మహనీయుని అడుగుజాడలలో మనమందరం నడవాలని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే-సావిత్రి బాయి పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సద్దాం హుస్సేన్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ అత్తెన రాజేందర్, యువ నాయకులు సలీం మాలిక్, శ్రీకాంత్, శ్రీను, బంటి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● **సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి**

● **రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు కిషన్ రెడ్డి డిమాండ్**

**జగిత్యాల/సిద్దిపేట ఏప్రిల్ 11 ( ప్రజామంటలు):** ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుని తక్షణమే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జగిత్యాల రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 5 వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం చేపట్టిన రెడ్ల నిరసన దీక్షలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.... రెడ్డిల్లో చాలా మంది పేదలున్నారని వారిని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కేసీఆర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేకుంటే తెలంగాణలో ఉన్న 18 శాతం రెడ్డి వర్గీయులు అందరం సంఘటితమై రెడ్డి కార్పొరేషన్ కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. దీక్షలో కళాకారుల ఆట పాటలు అహుతులను అలరించాయి. మహిళలు దీక్ష శిభిరంలో కోలాటం ఆడారు. నిరసన దీక్షకు సిద్ధిపేట జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది తరలి రాగా హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, మేడ్చల్, వరంగల్ తదితర జిల్లాలనుండి రెడ్డి కుటుంబ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. వేసవికాలం దృష్ట్యా దీక్షలో పాల్గొన్న వారికి రాగి జావ, మంచినీటి వసతిని కల్పించారు. దీక్షలో రాష్ట్ర నాయకులు



అప్పమ్మగారి రాంరెడ్డి, బుట్టంగారి మాధవరెడ్డి, లక్ష్మా రెడ్డి, గోపాల్ రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్ రెడ్డి, శశికళ రెడ్డి, అరుణారెడ్డి, చంద్రకళరెడ్డి, సుష్మితరెడ్డి, తిర్మలరెడ్డి, పద్మారెడ్డి, విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

**గొల్లపల్లి ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** వెలివాడలకు అక్షర దారులు వేసిన క్రాంతి దర్శి, సామాజిక విముక్తి దేశంలో నిజమైన మహాత్ముడు, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రములో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమల్ల జలంధర్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... సమాజ%శీ%లో అత్యధిక శాతంగా ఉన్న బలహీన వర్గాలు ఉన్నతంగా ఎదగాలని, సామాజిక, ఆర్థిక అసమానతలు ఉండకుండా అందరు చదువుకొని జ్ఞానవం తులు కావాలని అందుకోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు, మహాత్మా జ్యోతిబాపూలే గారనీ ఈసందర్భంగా తెలిపారు. తెలంగాణ రాష్ట్రంఏర్పాటు లో విద్యార్థులు, నిరుద్యోగులు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాటం యోధుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి జలంధర్, సర్పంచులు నిశాంత్ రెడ్డి , ఎర్రవేణి రమేష్ , మార్కెట్ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, వైస్ చైర్మన్ కనుకుట్ల లింగారెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బోయపోతూ గంగాధర్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ మారంపల్లి బాబు, జిల్లా ముదిరాజ్ యూత్ ఉపాధ్యక్షులు బొండ్ల నాగరాజ్, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు కోలకాని జలంధర్, మండల యూత్ అధ్యక్షులు కాసాని గంగాధర్, ప్రధాన కార్యదర్శి కాళ్ల



రాజయ్య, పట్టణ అధ్యక్షులు చంద్రయ్య ఐతరవేని మల్లయ్య కోమల్ల గంగాధర్, నాయకులు నరసాపురం రవీందర్, కొక్కుల భూమయ్య, చౌటపెల్లి తిరుపతి, బోజనపు శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# 20 రోజుల పాటు సమ్మెను వాయిదా వేసిన జూడాలు

◆ **హెల్త్ మినిస్టర్ సూచనతో డీఎంఈ తో భేటి**

◆ **పరిష్కరించకపోతే తిరిగి మే 3 నుంచి సమ్మె**

**సికింద్రాబాద్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 11 మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన జూనియర్ డాక్టర్ల సమ్మె వాయిదా పడింది. హెల్త్ మినిస్టర్ సూచన మేరకు డీఎంఈ డా. కే. రమేశ్రెడ్డితో జూడా ప్రతినిధులు భేటి కాగా, డిమాండ్ల పరిష్కారానికి డీఎంఈ హామినిచ్చిన మేరకు తాత్కలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నామని, 20 రోజుల గడువులో తమ డిమాండ్లు పరిష్కారం కాకపోతే తిరిగి మే 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధికంగా సమ్మె చేస్తామని గాంధీ మెడికల్ కాలేజీ జూడా యూనిట్ ప్రెసిడెంట్ డాక్టర్ కరిష్మి తెలిపారు. ప్యారెంట్ ఆసుపత్రులకు సమీపంలోని ఏరియా ఆసుపత్రుల్లో పోస్టింగ్ ఇస్తూ తిరిగి పీజీ డాక్టర్లకు రివైజ్డ్ ఆర్డర్లను ఒకటి, రెండు రోజుల్లో ఇస్తామని డీఎంఈ హామినిచ్చారని, అలాగే జిల్లా ఆసుపత్రుల్లో పనిచేసే పీజీలకు హైజనిక్ తో కూడిన వసతిగృహాలను, ఫుడ్డు ఫెసిలిటిని ఎన్ఎంసీ గైడ్ లైన్స్ ప్రకారం ఇస్తామని హామినిచ్చారని తెలిపారు. 15శాతం మేర స్టైఫండ్ పెంపుకు సంబందించిన ఫైల్ ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ లో ఉందని, దీనిని 20 రోజుల్లో క్లియర్ చేస్తామని హామినిచ్చారని, అలాగే పెండింగ్ స్టైఫండ్ డబ్బులను వారంలోగా ఇస్తామన్నారని, ప్రతినెలా స్టైఫండ్ ను క్రమం తప్పకుండా



ఇస్తామని డీఎంఈ అశ్యూరెన్స్ ఇచ్చారని డా. కరిష్మి వివరించారు. డీఎంఈ ఇచ్చిన హామీ మేరకు 20 రోజుల పాటు సమ్మెను వాయిదా వేశామని, కాని మే 2 లోగా తమ డిమాండ్లు పరిష్కారం కాకపోతే మే 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని టీచింగ్ ఆసుపత్రుల్లో జూడాలు డ్యూటీలను బహిష్కరిస్తామని డా. కరిష్మి తెలిపారు.

## విద్యుత్ భవన్‌లో

## జ్యోతిరావు పూలే జయంతి

**జగిత్యాల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఘనంగా జ్యోతి రావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ. సత్యనారాయణ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ



జ్యోతిరావు పూలే చేసిన సేవలు కొనియాడారు. జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర విద్యుత్ ఉద్యోగులకు వివరించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ టెక్నీకల్ శివరాములు, ఏవో లక్ష్మణ్, ఎడి టెక్నీకల్ నగేష్ కుమార్, ఎడి కమర్షియల్ వెంకటేశ్వర్లు, ఏడీఈ లు, ఏఈ లు, విద్యుత్ ఉద్యోగులు, సర్కిల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్కతుర్తిలో

## జ్యోతి రావు పూలే జయంతి

**ఎల్కతుర్తి ఏప్రిల్ 11 ( ప్రజామంటలు):** మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి మహాత్మా జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన. ఎల్కతుర్తి మండల. మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్రె మహేందర్ మాట్లాడుతూ.... బడుగు బలహీన వర్గాల



ఆశా జ్యోతి మహాత్మా జ్యోతి రావు పూలే అన్నారు. ఆశయాలను సమాజములోని ప్రతి ఒక్కరు కొనసాగించాలని, సామాజిక ఉద్యమకారుడని, గొప్ప సంఘ సంస్కర్త అని, వెనుకబడిన, అట్టడుగు వర్గాల ప్రజల్లో వెలుగు నింపిన సామాజిక తత్వవేత్త అని అన్నారు. విద్యతోనే సామజిక అభివృద్ధి సాధ్యమని, అయన చూపిన బాటలోనే అందరు నడవాలని, కుల మతాల వ్యతిరేకంగా సమానత్వం కోసం పోరాడిన మహత్ముని కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర సభ్యులు ఉమ్మడి జిల్లా ఇన్చార్జి చేరాలు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు అంబాల ఆనంద్ అంబేద్కర్, మండల అధ్యక్షులు ఆర్యన్ రాజ్ దాట్ల నరేష్, శ్రీను కొడిశాల, వినయ్ గౌడ్, సాహూ సాంబయ్య, జయంతి, వర్ధంతి ల ఉత్సవం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు

## అండగా నిలుస్తున్న బొమ్మ శ్రీరామ్

**ఎల్కతుర్తి ఏప్రిల్ 11 ( ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన చుంచు శ్రీకాంత్ మరణించగా, అతని తండ్రి చుంచు పోచయ్య, రాష్ట్ర మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ హుస్నాబాద్



నియోజకవర్గ బీజేపి నాయకులు బొమ్మ శ్రీరాం చక్రవర్తి అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా "బొమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు గొడిశాల వినయ్ బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అంచనగిరి వెంకటరమణ, స్థానిక నాయకులు చుంచు చిరంజీవి, శ్రీధర్, ప్రమోద్, పోచయ్య, శ్రీనివాస్, బొమ్మ ఫౌండేషన్ సభ్యులు తదితులున్నారు.



ఎడవెల్లి ప్రూటీ పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు ఎడవల్లి సన్నీ అమృత జనగామ రైల్వే స్టేషన్ వద్ద మహా అన్నదానం. పాల్గొన్న జనగామ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీంరాజు, తెలంగాణ ప్రైవేట్ డ్రైవర్ యూనియన్ చేసి జనగాం జిల్లా అధ్యక్షుడు మందే దిలీప్, ఉపాధ్యక్షుడు శ్రీ రాజు జనగామ అమ్మ ఫౌండేషన్ టీం కొయ్యడ రవి, కోంద్రు ప్రవీణ్, సల్ల మహేష్, బింగి నరసింహులు, వెంపటి అజయ్, అప్పు, నర్సింగ్, మెకానికల్ రవి.

# కరోనా జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..!

దేశంలో రోజురోజుకూ కరోనా కేసులసంఖ్య పెరుగుతుండటం మరోసారి ప్రమాద ఘంటికలను సూచిస్తోంది. కరోనా తొలినాళ్లలో ఉన్న పరిస్తితులే ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయి. క్రమంగా రోజుకు కొన్ని కేసులు పెరుగుతున్నాయి. క్రమంగా పెరుగుతున్న కేసులతో దేశవ్యాప్తంగా ఆస్పత్రుల సన్నద్ధతలపై మాక్‌డ్రిల్ నిర్వహిం రు. కేంద్రం కూడా రాష్ట్రాలకు మెచ్చరికలు చేసింది. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉండాలని సూచించింది. అలాగే మార్కెట్లో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. రాష్ట్రాలు స్వయంగా వీటిని కొనుగోలు చేయాల్సిందేనని కూడా తేల్చి చెప్పింది. గతంలో లాగా వ్యాక్సిన్ల కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఇప్పుడు లేదు. ఇకపోతే ప్రజలు కూడా మళ్లీ అప్రమత్తం కావాల్సిందే. ప్రభుత్వం ఇచ్చే సూచనలు పాటిస్తే స్వీయ నియంత్రణ పాటిస్తే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో కేసుల సంఖ్యతో పాటు మరణాల సంఖ్య మెల్లగా పెరుగుతోంది. ఇప్పుడు మరణాలు పదుల సంఖ్యలోనే ఉన్నా ఎలాంటి విపరీతాలకైనా దారితీయవచ్చు. అందువల్ల ఎవరికి వారు స్వీయనియంత్రణతో ముందుకు నడవాల్సి ఉంది. కోవిడ్ బాధితులకు పూర్తిస్థాయి వైద్యం అందించేలా అన్ని ప్రభుత్వాసుపత్రుల నూ సిద్ధం చేయాలన్న కేంద్రం హెచ్చరిక నేపథ్యంలో రాష్ట్రాలు కూడా అంతా సిద్ధం చేసుకోవాలి. ప్రైవేటు ఆసుపత్రుల్లో నిబంధనల ప్రకారం అడ్మిట్ చేసుకోవడం మొదలు అక్రమంగా అధిక బిల్లులు వసూలు చేయకుండా కట్టడి చేయడగలగాలి. అవకాశమొస్తే ప్రజల ప్రాణాలతో చెలగాట మాడేందుకు ప్రైవేట్ ఆస్తప్రులు సిద్దంగా ఉన్నాయి. వైరస్ మరింతగా వ్యాపించకుండా ఉండేందుకు, వ్యాధి సోకినా తట్టుకునే విధంగా జాగ్రత్తలు పాటించడం మనందరి బాధ్యతని గుర్తించాలి. మరోమారు కరోనా జాగ్రత్తలపై హెచ్చరి కలు, ప్రచారాలు చేపట్టాలి. ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య, మరణాలు మూడేళ్ల క్రితం నాటితో పోల్చితే స్వల్పమే అయినప్పటికీ... ఇదేవిధంగా పెరుగుదల నమోదైతే మరింత కష్టం. కనుక కట్టడి చేసేందుకు ప్రభుత్వాలు సమగ్ర ప్రణాళికలతో కదలాలి. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, కేరళలో ఉధృతి అధికంగా ఉండగా, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు తదితర చోట్ల కేసుల సంఖ్య స్థిరంగా పెరుగుతోంది. కరోనా వైరస్‌లో జన్యుపరమైన వేరియంట్లను గుర్తించడానికి 50కి పైగా ప్రయోగశాలలతో కూడిన 'ఇండియన్ సార్క్- కోవ్ - 2 జీనోమిక్స్ కన్సార్టియమ్' (ఇన్సాకాగ్) కృషి చేస్తోంది. వీలైనన్ని ఎక్కువ పాజిటివ్ నమూనాలను ఇన్సాకాగ్ ల్యాబ్‌లకు పంపి, జన్యు నిర్మాణ క్రమాన్ని విశ్లేషిస్తే కొత్త వేరియంట్లను ఎప్పటికప్పుడు కనిపెట్టి, చర్యలు తీసుకునేందుకు అవకాశముంది. గత నెలలో ప్రధాని మోడీ కరోనాపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. 'టెస్టింగ్ - ట్రాకింగ్ - చికిత్స -టీకా - కోవిడ్ అప్పట్లోనే సూచనలు జారీ చేసింది. తాజాగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ కూడా రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులతో సమీక్షించారు. ఆస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని సూచించారు. ఇకపోతే దేశంలో ఇప్పటివరకూ 220.60 కోట్లకుపైగా వ్యాక్సిన్ డోసులు పంపిణీ జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గతంలో ఎక్కువమంది కోవిడ్ బారిన పడటంతో



రోగనిరోధక శక్తి ఉండటం కూడా తాజా వేరియంట్లను ఎదుర్కోవడానికి కొంత అవకాశంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. నాటి పరిస్థితులు ఒక్కసారి గుర్తు చేసుకుంటే భయం కూడా కలుగుతోంది. ఇప్పుడా పరిస్థితి లేదు. చాలామందికి ఇమ్యూనిటీ వచ్చింది. వ్యాక్సిన్ కూడా బాగా తోడ్పడింది. గతాన్ని పరికిస్తే...శ్మశానాల ముందు బారులు తీరిన మృతదేహాలు, ఒకేసారి వందలాదిగా సాగిన అంత్యక్రియలు, ఆసుపత్రుల్లో ఆక్సిజన్ పూర్తి స్థాయిలో సరఫరా కాక ఆగిన మరణాలు, ఆప్తులను, కుటుంబ పెద్దలను కోల్పోయి తల్లడిల్లిన కుటుంబాలు, చివరి చూపునకూ నోచని వైనాలు, కోవిడ్ మరణాలను సక్రమంగా నమోదు చేయలేదన్న విమర్శలు... కళ్ల ముందు కదలాడతాయి. ఇప్పుడా దుస్థితి లేదు. కానీ జాగ్రత్తలు మాత్రం ఎప్పుడూ అవసరమే. ఫిబ్రవరి రెండో వారంలో వందకుపైగా కేసులు నమోదైతే, మార్చి నెలాఖరు నాటికి మూడు వేల మార్కుకు చేరు కుంది. రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాట్, మాజీ సిఎం వసుంధర రాజె వంటి ప్రముఖులు సైతం వైరస్ బారిన పడ్డారు. టెస్టుల సంఖ్య బాగా తక్కువగా ఉన్న నేపథ్యంలో కేసుల సంఖ్య అంతకన్నా మరిన్ని రెట్లు ఎక్కువగానే ఉండొచ్చు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కోవిడ్ విజృంభణకు వైరస్ తరచూ మ్యుటేషన్ జరగడమే ప్రధాన కారణం అని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ 700కుపైగా వేరియంట్లు పుట్టుకొచ్చాయి. వాటిలో ప్రస్తుతం హెచ్1ఎన్1, హెచ్3ఎన్2, డెల్టా, ఒమిక్రాన్, దాని సబ్ వేరియంట్లయిన బిఎ1, బిఎ2, ఎక్స్ఇ తదితరాలు విజృంభిస్తున్నాయి. కరోనా చల్లబడ దంతో ప్రజలు యధావిధిగా తమ పనుల్లో నిమగ్నం అయ్యారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరులో మార్పు రాలేదనే చెప్పాలి. ఐసియులు, పడకలు, ఆక్సిజన్ ప్లాంట్లు, సరఫరా తదితర అంశాలపై శ్రద్ధ అంతంత మాత్రంగానే ఉంది. దేశ రాజధాని ఢిల్లీలోనే ప్రతిరోజూ 400 పైగా కేసులు నమోదవుతున్నాయి. హృదయ, ఊపిరి తిత్తుల జబ్బులు, క్యాన్సర్ బాధపడుతున్న వారు కోవిడ్‌ని ఎదుర్కొనేందుకు ఆసుపత్రిలో చేరవలసి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వైరస్ వ్యాప్తి కావడానికి ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉందంటున్నారు. మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం తదితర జాగ్రత్తలు పాటించడం ద్వారా దీనికి కొంతమేర అడ్డుకట్ట వేయవచ్చు. ప్రభుత్వాల తీరులోనూ సన్నద్ధత మరింత పెరగాల్సిన అవసరం ఉంది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## భావి తరాలకు

తల్పగిరి రాజు విశేష వర్మ కళలను పోషిస్తూ కాళాకారులకు మంచి బహుమతులు ఇస్తూ, సన్మానాలు చేస్తూ వారి సృజనకు మరింత తోడ్పడేవాడు.

ఒకసారి ఆయన ఆస్థానానికి చిత్రవర్మ అనే తైలవర్ణ చిత్ర కారుడు వచ్చి తన అధ్బుత చిత్రాలు చూపాడు. సభలోని అందరూ అది అనితర సాధ్యమైన కళగా భావించారు! ఆస్థానంలోనే ఉన్న ఆస్థాన చిత్రకారుడు కౌశల్యుడు కూడా చిత్రవర్మ చిత్రాలు చూసి ఆశ్చర్యపోయాడు, ఎందుకంటే చిత్రాలలో జీవకళ ఉట్టి పడుతున్నది,ముఖ్యంగా ఒక వృద్ధుని చిత్రానికి వేసిన కేశాలు అధ్బుతం, అసలు ఏరకం కుంచెతో ఆ కేశాలు వేశాడో



ఆస్థాన చిత్రకారుడికి అంతుబట్టలేదు.

"తమరి చిత్రాలు అధ్బుతం నేను చిత్రకారుడైనా మీ చిత్రకళ నన్ను విశేషంగా ఆకర్షిస్తున్నది.దయచేసి మీరు ఈ చిత్రాలలో ఉపయోగించిన కుంచెలు,రంగుల కలయిక, వేయడంలో మీ మెళకువలు దయచేసి నాకు నేర్పండి ఈ విధంగా చేస్తే మీ కళ చిరకాలం నిలబడుతుంది" అని చేతులు జోడించి అడిగాడు కౌశల్యుడు.

"కౌశల్యా, తప్పకుండా నేను చిత్రకళలో ఆచరించే మెళకవులు అన్నీ చెబుతాను, నిజమే ఏ కళ అయినా మనతోనే నశించి పోకూడదు, భావితరాల వారికి అందించాలి ఆ మెళకవులు కూడా వారికి తెలియాలి" అని ఎంతో మంచిగా చెప్పాడు చిత్రవర్మ.

ఈ సంభాషణ అంతా వింటున్న రాజు విశేషేవర్మకు మంచి ఆలోచన వచ్చింది.

"చిత్రవర్మా, కౌశల్యుడా మీ మాటలు విన్నాక నాకు ఒక ఆలోచన వచ్చింది, ఉదాహరణకు చిత్రవర్మ వేసిన అధ్బుత చిత్రాలు మన ప్రదర్శన శాలలో పెట్టి, ఆ చిత్రానికి ఉపయోగించిన కుంచెలు, రంగులు,దానిని చిత్రీకరించడానికి ఆయన ఉపయోగించిన మెళకువలు ఆచిత్రం కిందనే వ్రాసి ఉంచితే భావితరాలకు ఆ కళ వివరాలు తెలుస్తాయి, కేవలం చిత్రకళేకాదు శిల్పకళ, విచిత్ర అల్లికలను గురించి కూడా మన ప్రదర్శన శాలలో ఉంచితే ఆయా కళలు నిలబడిపోతాయని నా ఉద్దేశం" అని వివరించాడు విశేషవర్మ.

రాజు గారి మంచి ఆలోచన చిత్రకారుడు చిత్రవర్మకి కౌశల్యుడికి ఎంతో నచ్చింది, సభికులకు కూడా ఎంతో నచ్చి అందరూ కరతాళ ధ్వనులు చేశారు.

"ఇప్పటికీ మన దేశంలో కొన్ని దేవాలయాల నిర్మాణానికి ఉపయోగించిన మెళకవులు వారు ఉపయోగించి పనిముట్లను గురించి తెలియదు. కొన్ని గుహల్లో చిత్రించిన చిత్రాల కళమెళకవులను గురించికూడా తెలియడం లేదు, ఈ దుస్థితి పోవాలంటే నేను చెప్పిన విధంగా చేస్తే ఆ కళలు నిలబడగలవు" అని మరింత వివరించాడు విశేషవర్మ. మరలా సభ కరతాళ ధ్వనులతో మార్మోగింది.

- కంచనపల్లి వేంకట కృష్ణారావు
9348611445

# అంతరిక్ష రంగంలో భారత్ ముందంజ

## ఏప్రిల్ 12...అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం

అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 12న నిర్వహించబడుతుంది. యూరీ గగారిన్ అంతరిక్షంలోకి వెళ్ళిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవం జరుపబడుతుంది. అంతరిక్షంలోకి ప్రవేశించిన మొట్టమొదటి మానవుడిగా యూరీ గగారిన్ చరిత్రలో నిలిచిపోయారు. 1961 ఏప్రిల్ 12న వొస్టోక్ 1 విమానంలో అంతరిక్షయానం చేశారు. ఏప్రిల్ 12న గగారిన్ 108 నిమిషాల పాటు అంతరిక్ష నౌకలో భూమి చుట్టూ పరిభ్రమించిన ఈ రోజునే.. అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాము. అంతరిక్షయానం 50వ వార్షికోత్సవానికి కొన్ని



రోజుల ముందు 2011, ఏప్రిల్ 1న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 65వ సెషన్‌లో ఈ దినోత్సవం జరుపుకోవాలని తీర్మాణం జరిగింది.

1957, అక్టోబరు 4న స్పుట్నిక్ 1అనే తొలి మానవ నిర్మిత ఉపగ్రహాన్ని ప్రారంభించి అంతరిక్ష అన్వేషణకు శ్రీకారం చుట్టగా, 1967 అక్టోబరు 10న చంద్రునితో సహా ఇతర ఖగోళ ప్రాంతాలలో అన్వేషణ వివిధ దేశాల కార్యకలాపాల నిబంధనలపై సంతకం చేయబడింది.

"విక్రం సారాభాయ్‌ని భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడిగా" అభివర్ణిస్తారు. 1957లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ అయిన స్పుత్నిక్‌ను ప్రయోగించి నపుడు శాటిలైట్ యొక్క ఆవశ్యకతను అప్పటి ప్రధాన మంత్రి అయిన నెహ్రూకు వివరించి, 1962లో, భారత అణుశక్తి వ్యవస్థ పితా మహుడయిన హోమీ భాభా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (INCOSPAR)ను ఏర్పరచాడు.

కేరళలో త్రివేంద్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ (TERLS) నెలకొల్పి అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరి తలాన్ని అధ్యయం చేయడం మొదలు పెట్టారు. అనతికాలంలోనే భారతదేశం స్వదేశీయంగా పూర్తి స్థాయి రాకెట్లను తయారు చేసి, ఉపరితల అధ్యయంలో పురోగతి సాధించింది. ఉపగ్రహాలను తయారు చేయడమే కాకుండా వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్, ఉపగ్రహ వాహకనౌక రూపకల్పన మొదలు పెట్టాడు. అలా తయారైనదే సెటిలైట్ లాంచ్ వెహికిల్ (%ూాఎ%). ఇస్రో తయారు చేసిన తొలి పూర్తిస్థాయి ఉప గ్రహానికి భారత గణిత, ఖగోళ శాస్త్రవేత్త అయిన "ఆర్యభట్ట" పేరు పెటారు. భారత దేశపు మొట్ట మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను 1975 ఏప్రిల్ 19న అప్పటి సోవియట్ యూనియన్ నుండి విజయ వంతంగా ప్రయోగించారు.

ఇన్‌శాట్ - INSAT లేదా భారత జాతీయ ఉపగ్రహ వ్యవస్థ (Indian National Satellite System) అనేది సమాచారం, వాతావరణం, ప్రసారాలు మొదలయిన బహుళ ప్రయోజనాల కోసం ఇస్రో తయారు చేసిన ఉపగ్రహాల శ్రేణి. 1983లో మొదలయిన ఇన్‌శాట్, ఆసియా, పసిఫిక్ దేశాల్లో అతిపెద్ద ఉపగ్రహాల వ్యవస్థ. ప్రస్తుతం 199 ట్రాన్స్ పాండర్లతో భారతదేశం లోని దాదాపు అన్ని టెలివిజన్, రేడియోలకు మాధ్యమంగా ఉన్న ఈ ఉపగ్రహాలను కర్నాటకలోని హస్సన్, భోపాల్ ల నుండి అనుక్షణం పర్యవేక్షిస్తుంటారు. తద్వారా అంతరిక్ష పరిశోధనల్లో మన దేశం ఎంతో ముందంజలో ఉందని కొనియాడారు. అంతరిక్ష ప్రయోగాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడతారని ప్రశ్నించే వారికి... దీపావళి పండుగ కోసం పటాసులు కాల్చడానికి దాదాపు 600 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తారనేది ఒక అంచనా ఉందని, అయితే మంగళయాన్ ప్రయోగం కోసం ఇస్రో కేవలం వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి విజయం సాధించడం గొప్ప పరిణామమని ఆయన ధీటైన సమాధానం చెప్పారు. ప్రపంచ దేశాలు చేయలేని సాహసం ఇస్రో చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంగళయాన్ సక్సెస్‌తో భారత్ ప్రపంచ దేశాల సరసన చేరిందని వెల్లడించారు.

అంతరిక్ష రంగంలో అధునాతన సామర్థ్యాలు కలిగి ఉన్న కొన్ని దేశాలలో భారత్ ఒకటి. భారత్ లో ప్రతిష్ఠాత్మక ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి...1.తుంబా: కేరళలో తిరువనంత పురం సమీపాన భూ అయస్కాంత రేఖకు దగ్గరలో ఉన్న తుంబాలో 1962లో మొదటి రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి శాస్త్రవేత్తలలో అబ్దుల్ కలాం ఒకరు. మొదట కేవలం రాకెట్ల ప్రయోగ కేంద్రముగా ఉన్న తుంబా నెమ్మదిగా రాకెట్లకు అవసర మయిన ప్రొపెల్లర్లు, ఇంజన్లు తయారు చేసి అమర్చ గలిగి పూర్తిస్థాయి రాకెట్ నిర్మాణ కేంద్రంగా తయారయింది. 2.శ్రీహరి కోట: భారత దేశంలో ఉపగ్రహాల ప్రయోగానికి అత్యంత అనువయిన ప్రదేశ మయిన శ్రీహరికోట నెల్లూరు జిల్లాలో సూళ్ళూరుపేట దగ్గర ఉంది. ఈ అంతరిక్ష కేంద్రం పేరు "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం".

దీనినే "షార్" అని కూడా పిలుస్తారు. ఇది భారతదేశం లోని ఉపగ్రహ ప్రయోగ కేంద్రం. ఇక్కడనుండి ఎన్నో పి.ఎస్ ఎల్. విబీ జి.ఎస్.ఎల్.వి ఉప గ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. ప్రస్తుతం ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్‌లు ఉన్నాయి. ఈ రెండిటి వల్ల ప్రతి ఏడాది 6 శాటిలైట్లను ప్రయోగించే వీలు ఉంది. 3.బలేశ్వర్ ఒరిస్సాలో ఉంది. శ్రీహరికోటలో ఉన్నట్లు ఇక్కడ శాటిలైట్ల ప్రయోగానికి సౌకర్యాలు లేకున్నా, దీనిని ప్రధానంగా క్షిపణులను ప్రయోగించుటకు ఉపయోగిస్తారు. 2005లో రెండవ లాంచి ప్యాడు ఆపరేషను, 2008 లో చంద్రయాన్, 2014లో మంగళ్ యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం - అప్పటికి ఇది ఇస్రో రికార్డు, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగం - ఇది ప్రపంచ రికార్డు

2017 - జిఎస్ఎల్‌వి మార్క్ 3 ప్రయోగం, దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజను విజయ వంతమైంది.

ప్రసిద్ధమైన ఇస్రో సంస్థ దేశాభివృద్ధి లక్ష్యంగా అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏర్పాటై, ప్రస్తుతం ప్రపంచంలోని అంతరిక్ష రంగ సంస్థల్లో ఒకటిగా పేరొందింది. బెంగుళూరు కేంద్రంగా ఏర్పాటైన ఇస్రో, దేశంలోని వివిధ ప్రదేశాల్లో పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలు కలిగి ఉంది. ఇస్రో భారత ప్రభుత్వపు అంతరిక్ష శాఖకు అనుబంధంగా ఉంది. అంతరిక్ష శాఖ ప్రధాన మంత్రి, అంతరిక్ష కమిషన్ అధీనంలో ఉంటుంది. ఇస్రో కింది విభాగాలను, సంస్థలను నిర్వహిస్తుంది. అంతరిక్ష కార్యకలాపాల లోకి ప్రయివేటు రంగాల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ అంతరిక్ష రంగంలో చాలా కీలకమైన సంస్కరణలకు ఆమోదం తెలిపింది. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో మన అంతరిక్ష విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించనే సామర్థ్య మరింతగా పెరుగుతుంది. మన అంతరిక్ష రంగం త్వరిత గతిన అభివృద్ధి చెందటమే కాకుండా.. అంతరిక్ష ఆర్థిక వ్యవహారాల్లో భారత్ అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషించేందుకు వీలవుతుంది.



-ఆర్కె సంగనభట్ల
9440595494

# సామాజిక మీడియాకు సంకెళ్ళు

సామాజిక మాధ్యమాల్లోని 'నకిలీ వార్తల'ను లేదా 'అబద్ధపు సమాచారా'న్ని అరికట్టేందుకు సామాజిక సాంకేతిక (ఐటి) చట్టానికి కేంద్రం తీసుకొచ్చిన సవరణ 1975- 77 నాటి చీకటి రోజులను గుర్తుకు తెస్తున్నది. రాచరిక ప్రభుత్వాల అడుగు జాడల్లో నడవడమే ప్రధాని మోడీ మార్కు ప్రజాస్వామ్యమని చాటుతున్నది. తమది అప్రకటిత ఎమెర్జెన్సీ పాలన అని కుండబద్దలు కొట్టినట్టు చెబుతున్నది. సామాజిక మాధ్యమాల్లో, ఇంటర్‌నెట్ సమాచార వాహినుల్లో కేంద్రానికి సంబంధించి వచ్చే 'తప్పుడు వార్తల'ను అరికట్టాలని మోడీ ప్రభుత్వం అకస్మాత్తుగా ఇప్పుడే ఎందుకు




సంకల్పించిందో, దాని ఆంతర్యమేమిటో ఐటి చట్టానికి ఈ నెల 6వ తేదీన అది తీసుకు వచ్చిన సవరణ సందేహాతీతంగా తెలియజేస్తున్నది. వాస్తవానికి ఈ సవరణ నకిలీ వార్తలకు తెర దించడానికి బదులు సామాజిక మాధ్యమాల నిర్వాహకులను భయపెట్టి తమ దారికి తీసుకు రావడానికి ఉద్దేశించిందే. కేంద్ర ప్రభుత్వం గురించి సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని తనిఖీ చేసి అందులోని 'నకిలీ వార్తల'ను గుర్తించడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసే అధికారాన్ని ఈ సవరణ కేంద్ర ఎలెక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖకు కట్టబెడుతున్నది. ఈ చట్టం సెక్షన్ 3 ప్రకారం తమ వేదికలపై కేంద్రానికి సంబంధించి వచ్చే తప్పుడు సమాచారాన్ని తొలగించేలా చేయవలసిన బాధ్యత ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలపై వుంటుంది. అలాంటి వార్తలను తొలగించనట్లయితే ఆ సామాజిక మాధ్యమాలు తమకున్న రక్షణ కవచాన్ని కోల్పోతాయి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలను గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రతేక విభాగాన్ని నెలకొల్పడమనేది ఎమెర్జెన్సీలో అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం పత్రికలను అదుపు చేయడానికి తీసుకొన్న చర్యనే గుర్తు చేస్తున్నది. అప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ అధికారులు పత్రికా కార్యాలయాల్లోకి ప్రవేశించి ఇష్టా రాజ్యంగా సెన్సార్ షిప్‌ను అమలు పరిచేవారు. వార్తా రచన ప్రాథమిక విషయాలు కూడా తెలియని అధికారులు ప్రభుత్వం అనే

మాట వాడిన ప్రతి వార్తను లేదా వ్యాఖ్యను ప్రభుత్వ వ్యతిరేకమైనదిగా పరిగణిస్తూ దానిపై వేటు వేసేవారు. పత్రిక ప్రచురణకు వెళ్ళే సమయం వరకు అనుమతి ఇవ్వకుండా వేధించేవారు. దానితో పాఠకులకు సకాలంలో పత్రికను అందజేయలేని దుస్థితిలో నిర్వాహకులు నానా అగచాట్లు పడేవారు. రాజ్యాంగం 19(1) (ఎ) అధికరణ భారతీయులందరికీ భావ ప్రకటన హక్కును ఇస్తున్నది. అదే సమయంలో 19(2) అధికరణ దానిపై సహేతుకమైన పరిమితులను విధిస్తున్నది. సహేతుకమైన పరిమితులు అనే దానిని పాలకులు మీడియా నోరు నొక్కివేసే దుర్మార్గానికి దుర్వినియోగం చేస్తున్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వం ఎమెర్జెన్సీ ప్రకటించకుండానే ఐటి చట్టానికి తీసుకు వచ్చిన ఈ సవరణ సామాజిక మాధ్యమాలను వినియోగించుకొంటున్న సాధారణ ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను సమూలంగా హరించడానికి ఉద్దేశించినదేనని బల్లగుద్ది చెప్పవచ్చు. భవిష్యత్తులో ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియా కంఠాన్ని కూడా నొక్కి వేయడానికి దీనిని ఉపయోగించరనే భరోసా లేదు.

అనేక రాష్ట్రాల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు చేరువలో వున్న సమయంలో ఈ ఐటి చట్ట సవరణను ప్రయోగించడం వెనుక కేంద్ర పాలకుల దురుద్దేశం సుస్పష్టం. ప్రభుత్వ తనిఖీ విభాగం సామాజిక మాధ్యమాల్లోని ఏ వార్తనైనా నకిలీ వార్త అని ముద్ర వేస్తే దానిని వెంటనే తొలగించవలసిన అవసరం వుండదని చెబుతూనే అటువంటి సామాజిక మాధ్యమంపై కోర్టుకు వెళ్ళే అవకాశాన్ని ఈ సవరణ ప్రభుత్వానికి కట్టబెట్టడం గమనించవలసిన విషయం. ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోడానికి! ఎమెర్జెన్సీ కాలంలో విధించిన ఆంక్షల ప్రకారం అప్పట్లో పత్రికలు ఎటువంటి పుకారుకు ప్రాధాన్యం ఇవ్వకుండా చీఫ్ ప్రెస్ అడ్వయిజర్ అనుమతి తీసుకున్న తర్వాతనే ఏ వార్తనైనా ప్రచురించాలనే కఠినమైన నిబంధనను అమలు చేశారు. దీనిని అప్పటి కొన్ని ప్రముఖ ప్రతికలు తీవ్రంగా వ్యతిరేకించి పోరాటం చేశాయి.

ప్రస్తుత ఐటి చట్ట సవరణ నకిలీ వార్త అని ఫిర్యాదు వచ్చిన దానిపై సామాజిక మాధ్యమాలు చర్య తీసుకోడానికి పూర్వమున్న 15 రోజుల వ్యవధిని 72 గం.లకు తగ్గించి వేసింది. తనకు సంబంధించి ఏది అసలు వార్తో ఏది నకిలీ వార్తో నిర్ధారించడానికి ఒక తనిఖీ విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించడం పట్ల ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సవరణను వాడుకొని విలేకరులను కూడా ఇబ్బందులకు గురిచేసే ప్రమా దం వున్నది. తమకు అప్రతిష్ఠ తెచ్చే తిరుగులేని వాస్తవాలను సైతం నకిలీ వార్తలని ముద్ర వేసి వాటిని నిరోధించే అధికారాన్ని ఈ సవరణ ద్వారా కేంద్ర పాలకులు తమకు తాము కట్టబెట్టుకున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం అడుగంటుతున్న చేదు వాస్తవం కళ్ళకు కడుతున్నది.

# రాజకీయ విమర్శలతో అడుగుపడని పోలవరం

రాష్టర విభజన తరవాత 9 ఏళ్ల విలువైన పూర్తి కాలం గడచిపోతయింది. అయినా పోలవరం నిర్మాణంలో అధికారం చేపట్టిన రెండు పార్టీలు దీనిని పూర్తిగా విస్మరించాయి. పరస్పర విమర్శలతో కేంద్రాన్ని నిలదీయడంలో టిడిపి, అధికార వైసిపిలు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నాయి. పోలవరం విషయంలో కీలకమైన కేంద్రాన్ని నిలదీసే విషయాన్ని పక్కన పెట్టి గత, ప్రస్తుత ప్రభుత్వాల కోణంలోనే విమర్శలు గుప్పిస్తే ఉపయోగం ఏమిటన్నది గుర్తించడం లేదు. టిడిపి,వైసిపిలు పరస్పర విమర్శలతో అసలు సమస్యను పక్కన పెట్టాయి. నిజానికిది ఎ.పి రాజకీయాలలోనే ఇది అత్యంత సంక్లిష్టమైన అంశం. బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్య అవగాహన, ఉద్యమాలు ఉమ్మడి పోరాటం పెరుగుతున్న కొద్దీ



వచ్చే ఎన్నికలలో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడం బిజెపికి పెద్ద సవాలు కానుంది. నిరంకుశ కార్పొరేట్ మతతత్వం, అదానీ కుంభకోణాలు, రాహుల్ అనర్హత వేటు వంటి వాటిపై అనేక రూపాల్లో వ్యక్తమవుతున్న నిరసనలను బిజెపి పట్టించుకునే ధోరణిలో లేదు. దక్షిణాదిన కాలూనడం బిజెపికి ఎప్పుడూ సవాలుగానే వుంది. ఇకపోతే బిజెపి విధానాలపై టిడిపి కూడా విమర్శలు చేయకుండా మళ్లీ మిత్త్వం నెరిపేందుకు సిద్దంగా ఉంది. పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబుకు అవగాహన వుందనీ, జనసేన సీట్ల వరకూ చెప్పి బిజెపి విషయం తనకు వదిలేయమని ఆయనకు చెప్పారని టిడిపి కీలక నాయకులు చెబుతున్నారు. ఇటీవల బిజెపి అధ్యక్షుడు నడ్డా టిడిపి గురించి సానుకూల సందేశాలిచ్చారు. ఈ మధ్యలో ముఖ్యమంత్రి జగన్ ఒకటికి రెండు సార్లు ఢిల్లీ వెళ్లి అమిత్ షా తో సహా కేంద్ర మంత్రులను కలసి వచ్చారు. రాష్ట్ర సమస్యలపై కేంద్రాన్ని అడిగారని వార్తలు వచ్చాయి. జగన్ ఎంత సానుకూలంగా ఉన్నా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపేది లేదనీ కేంద్రమంత్రులు చెప్పారు. జగన్ ప్రభుత్వం ఎంత సానుకూలంగా చిత్రించినా పోలవరం సహా ఏ సమస్యపైనా కేంద్రం అవసరమైన సహాయక చర్యలు చేపట్టడం లేదు. ఎ.పి విషయంలో సానుకూల చర్చలు తీసుకునే ఉద్దేశమే బిజెపికి లేదని దీంతో మరోసారి స్పష్టమైంది. మూడు ప్రాంతీయ పార్టీలూ ఏదో రూపంలో బిజెపి వ్యూహాలకే ఊతమిస్తున్న తీరును సిపిఎం గట్టిగానే విమర్శిం చింది. కొత్త పార్టీగా వచ్చిన వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షురాలు షర్మిల కూడా తెలంగాణలో తన ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇకపోతే ఎపిలో బిజెపిని బలోపేతం చేసే దిశగా చేస్తున్న యాత్నాల్లో భాగంగా మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డిని చేర్చుకున్నారు. బిజెపి ఆశించినట్టు ప్రముఖులెవరూ ఆ పార్టీలో చేరింది లేదు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాత్రం చేరారు గాని ఆయన వల్ల ఒరిగేది లేదని బిజెపి నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. పోలవరం నిర్మాణం పూర్తి చేయించి, విశాఖ ఉక్కును అమ్మకుండా ఉంటే బిజెపికి కలసి వచ్చేది. చెప్పుకునేందుకు ఈ రెండు అంశాలు ఉండేవి. కానీ ఇప్పుడు అలాంటి ప్రయత్నాఉల చేయకుండా పోలవరం భవిష్యత్‌ను ప్రశ్నార్ధకం చేశారు.

## గవర్నర్ల రాజకీయానికి చెక్ పెట్టాలి

### రాష్ట్రాభివృద్ధికి అడ్డంకిగా మారారు : మంత్రి జగదీష్ రెడ్డి

**సూర్యాపేట,ఏప్రిల్11(ప్రజామంటలు):** రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి గవర్నర్లను బీజేపీ ఏజెంట్లలా వాడుకుంటోందని మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. కేంద్రంలో ప్రధాని మోడీ కార్యక్రమాలను రాష్ట్రపతి అడ్డుకోనప్పుడు రాష్ట్రాల్లో గవర్నర్లు



అడ్డుకోవడం ఎందుకు అని ప్రశ్నించారు. నిర్ణీత వ్యవధిలో బిల్లుల ఆమోదం కోసం సుప్రీంని ఆశ్రయించాల్సి వస్తోందన్న ఆయన.. ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవడం గవర్నర్ పని కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వాల కంటే మెరుగ్గా పనిచేస్తోన్న ఇతర పార్టీల ప్రభుత్వాల అభివృద్ధిని కేంద్ర అడ్డుకుంటోందని మంత్రి కామెంట్ చేశారు. తెలంగాణ మోడల్ అభివృద్ధిని దేశమంతా అడుగుతున్నారని అక్కసుతో దుర్మార్గం చేస్తున్నారని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ని, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలనే ఆలోచనతో కేంద్రం నాటకాలు చేస్తోందన్న ఆయన.. శాసన సభ ప్రసంగంలో చెప్పిన అభివృద్ధి కార్యరూపం దాల్చకుండా గవర్నర్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఉపన్యాసంలో ఒకటి చెప్పి రాజ్ భవన్ లో చేసేది మరొకలా ఉందంటూ మంత్రి మండిపడ్డారు. గవర్నర్ తీరు భారత రాజ్యాంగం వ్యవస్థకు మంచిది కాదని, గవర్నర్ చర్యలు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంలా మారుతున్నాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి అడ్డుకోవడమంటే దేశ అభివృద్ధిని అడ్డకోవడమేనని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర గవర్నర్ తమిళి సై పై మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఆమె గవర్నరా, బీజేపీ నాయకురాలా అంటూ మండి పడ్డారు. బిల్లులను పెండింగ్‌లో ఉంచే అధికారం అమె కెక్కడిదని ప్రశ్నించారు. మంగళవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామిక ప్రభుత్వ చట్టాలను నిలువరించే హక్కు ఎవరిచ్చారని అన్నారు. రాజ్యాంగ మూలసూత్రాలను కాదని చట్టాలు అధిగమించమనిపిస్తే అడ్డుకునే అధికారం సుప్రీంకోర్టు ధర్మసనానికే ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థకు కేంద్రం తూట్లు పెట్టేలా ఉందని వెల్లడించారు.గవర్నర్ తీరు భారత ప్రజాస్వామిక వ్యవస్థకు గొడ్డలి పెట్టు అని విమర్శించారు. బీజేపీ యోతర రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకునే కుట్రలో భాగమేనని పేర్కొన్నారు. గవర్నర్‌ను అడ్డుపెట్టుకుని కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమాలకు మోకాలోడ్డే ప్రయత్నం చేస్తుందన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు అనేక కుటిన ప్రయత్నాలు చేస్తుందని మంత్రి ఆరోపించారు.

## కుక్కలదాడిలో 20 మేకపిల్లలు మృత్యువాత

**వికారాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు):** తాండూరు మండలం చెగనెస్పూర్ గ్రామంలో దారుణం జరిగింది. కుక్కల దాడిలో 20 మేకపిల్లలు మృత్యువాత పడ్డాయి. సోమవారం మధ్యాహ్నం వీధి కుక్కల దాడిలో 20 మేక పిల్లలు మృత్యువాత పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాండూరు మండలం చెగనెస్పూర్ గ్రామానికి చెందిన కురువ శివరాజ్ బతుకుదెరువు నిమిత్తం మేకలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మేకలను తీసుకొని అడవికి వెళ్లగా, మేక పిల్లలను ఇంటి దగ్గరే చిన్న గుడారంలో వదిలిపెట్టి వెళ్లాడు. ఎవరు లేని సమయంలో గ్రామంలోని కుక్కలు మేక పిల్లలపై తీవ్రంగా దాడి చేయడంతో 20 మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. అడవి నుండి మేకలను తీసుకొని ఇంటికి వచ్చిన శివరాజ్ కుక్కల దాడిలో చనిపోయిన మేక పిల్లలను చూస్తూ లబోదిబో మన్నారు. అప్పులు చేసి మరి కొనుక్కున్న మేకపిల్లలు మృత్యువాత పడటంతో ఆర్థికంగా తీవ్ర నష్టం ఏర్పడినట్లు ఈ సందర్భంగా కురువ శివరాజ్ తెలిపారు. ఈరోజు మేక పిల్లలపై కుక్కలు దాడి చేయగా.. రేపు పసి పిల్లలపై దాడి చేస్తే బాధ్యులు ఎవరు అంటూ గ్రామస్థులు అధికారులపై మండిపడ్డారు.

## కోటిన్నరతో ఉడాయించిన ఏటిఎం వ్యాన్ డ్రైవర్

### వ్యాన్‌ను గుర్తించిన ఆచూకీ లేని డ్రైవర్

**పాట్నా,ఏప్రిల్11(ప్రజామంటలు):** ఏటీఎం వ్యాన్ డ్రైవర్ సుమారు కోటిన్నర నగదుతో పరారీ అయ్యాడు. ఈ ఘటన బీహార్ రాజధాని పాట్నా నగరంలో ఉన్న దన్‌కా ఇమ్లీ చౌక్ వద్ద ఈ ఘటన జరిగింది. జీపీఎస్ ద్వారా వ్యాన్ నిలిపిన ప్రదేశాన్ని పోలీసులు గుర్తించారు. కానీ ఆ వ్యాన్ డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న 1.5 కోట్ల క్యాష్ బాక్స్ కనిపించడం లేదు. పాట్నాలో ఉన్న దన్‌కా ఇమ్లీ చౌక్ వద్దకు ఏటీఎం సిబ్బంది క్యాష్‌ను నింపేందుకు వచ్చారు. కస్టోడియన్ అమ్రేవ్ కుమార్ సింగ్, క్యాషియర్ సోనూ కుమార్, దిలీప్‌కుమార్, గన్‌మెన్ సుభాష్ డ్రైవర్ సూరజ్ కుమార్‌లు ఐసీఐసీఐ బ్యాంక్‌కు మధ్యాహ్నం 3.30కి చేరుకున్నారు. డిపాజిట్ మెషీన్లలో ఉన్న నగదును తీసి, ఏటీఎం విత్‌డ్రా మెషీన్లలో పెట్టాల్సి ఉంది. అయితే దన్‌కా చౌక్ వద్ద పార్కింగ్ సమస్య రావడంతో.. డ్రైవర్ సూరజ్ వాహనాన్ని కొంత దూరంలో పార్క్ చేశాడు. కస్టోడియన్, క్యాషియర్ ఇద్దరూ బ్యాంక్‌లోకి వెళ్లి అరగంట తర్వాత తిరిగి వాహనం వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో క్యాష్ వ్యాన్‌తో పాటు సూరజ్ కనిపించక పోవడంతో పాట్నా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూరజ్‌ను ఫోన్‌లో కాంటాక్ట్ అయ్యే ప్రయత్నం చేసినా ఫలించలేదు. చివరకు జీపీఎస్ ద్వారా వాహనాన్ని పోలీసులు ట్రాక్ చేశారు. వాహనాన్ని ఖాళీగా గుర్తించారు. డ్రైవర్ మిస్సింగ్‌లో ఉన్నట్లు తేల్చారు. సీసీటీవీ కెమెరాల ఆధారంగా సూరజ్ కోసం స్కానింగ్ మొదలుపెట్టారు. ఫోరెన్సిక్ బృందం కూడా ఫింగర్ ప్రింట్స్, శాస్త్రీయ ఆధారాలను సేకరించారు. ఆలమ్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారు.

## లీకేజ్‌లో ఈడీ ఎంటర్

### విచారణకు అనుమతివ్వాలని కోర్టుకు వినతి

**హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు):** టీఎస్ పీఎస్‌సీ ఇష్యూలో ఈడీ కేసు నమోదు చేసినట్లు నాంపల్లి కోర్టుకు అధికారులు తెలిపారు. టీఎస్ పీఎస్ సీ కేసుకు




సంబంధించిన వివరాలు తమకు ఇవ్వాలని మార్చి 23న సీసీఎస్ ఏసీపీకి ఈడీ అధికారులు లేఖ రాశారు. ప్రవీణ్ ,రాజశేఖర్‌లను విచారణ చెయ్యడానికి కోర్టు అనుమతి కోరారు. పిఎంఎల్ ఏ సెక్షన్ 50 కింద ప్రవీణ్, రాజశేఖర్ వాగ్మూలం రికార్డ్ చెయ్యాలని తెలిపారు. చంచల్ గూడ జైలులో ఉన్న నిందితులు ప్రవీణ్, రాజశేఖర్ లను నలుగురు అధికారులతో కూడిన బృందం విచారిస్తుందని కోర్టుకు తెలిపారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజ్ లో మనీ లాండరింగ్ జరిగినట్టు ఈడీ అభియోగం మోపింది. సెక్షన్ 48, 49 కింద తమకు విచారించే అర్హత ఉందని కోర్టుకు తెలిపారు ఈడీ అధికారులు. జైలులో విచారణ సందర్భంగా లాప్ టాప్, ప్రింటర్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించాలని కోరుతూ ఈడీ పిటిషన్ వేసింది. జైలులో విచారణకు తగిన ఏర్పాట్లు చేసేలా చంచల్ గూడ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

## మరో హైటెక్ సిటీగా తుక్కుగూడ

### కొత్తగా 52 కంపెనీలు వస్తున్నాయి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి

**రంగారెడ్డి,ఏప్రిల్11(ప్రజామంటలు):** తుక్కుగూడ మున్సిపాలిటీ మరో హైటెక్ సిటీగా మారబోతుందని మంత్రి సబిత పేర్కొన్నారు. తక్కుగూడకు కొత్తగా 52 కంపెనీలు వస్తున్నాయన్నారు. ప్రాంతంలో ఉన్న లక్షల మందికి ఉపాధి అవకాశాలు మెరుగు



పడుతాయన్నారు. ఐదలక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. రావిర్యాలలో ఐటీ ఐఆర్ కంపెనీ ఎందుకు పెట్టలేదో బీజేపీ నాయకులు చెప్పాలన్నారు. మంజూరు చేసిన ఐటీఐఆర్‌ను ఎందుకు రద్దు చేశారో బీజేపీ నాయకులు వివరణ ఇవ్వాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా అమలు అవుతున్నాయో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చెప్పాలన్నారు. దేశ సంపదను కార్పోరేట్, పెట్టుబడి దారులకు ధారదత్తం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీజేపీ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టవలసిన అవసరం ఉందన్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసి బిఆర్ఎస్ నేతలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనాలతో జోష్ కనిపించింది. ఇదిలావుంటే మహేశ్వరం నియోజకవర్గంలో ఎవరైనా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. పార్టీ పరువు తీసే నాయకులు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకు చేరడం జరిగిందన్నారు. ఈ పథకాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రధాన మంత్రి సైతం తప్పుడు ఆరోపణలు చేయడం దురదృష్ట కరమన్నారు.తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంచేసిందో గ్రామాలకు వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని అన్నారు.

## గవర్నర్ల ద్వారా అధికార దుర్వినియోగం

### బ్రిటిష్ కాలం నాటి వ్యవస్థను పారదోలాల్సిదే

### ట్విట్టర్ వేదిక మరోమారు కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు):** బీజేపీయేతర రాష్ట్రాలకే కేంద్రం సహకరించడం లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆ రాష్ట్రాలపై ప్రతీకారేచ్ఛతో కేంద్రం వ్యవహరిస్తున్నట్లు ఆయన



ఆరోపించారు. రాజ్యాంగపర మైన ఉన్నతపదవుల్లో ఉన్నవారు.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో రాజకీయ పావులుగా మారినట్లు ఆయన విమర్శించారు. నాన్ బీజేపీ రాష్ట్రాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని మంత్రి కేటీఆర్ తప్పుపట్టారు. ఆయన తన ట్విట్టర్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని అభిప్రాయ పడుతూ తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ చేసిన ట్వీట్‌ను మంత్రి కేటీఆర్ రీట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌కు కేటీఆర్ తన కామెంట్ జోడించారు. దేశంలోని నాన్ బీజేపీ రాష్ట్రాల్లో ఉన్న గవర్నర్ల తమ అధికారాలను నిర్దాక్షిణ్యంగా దుర్వినియోగం చేస్తున్నారని, గవర్నర్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని సమర్థిస్తూ కొణతం దిలీప్ ట్వీట్ చేశారు. బ్రిటీష్ కాలం నాటి గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ గవర్నర్ కూడా కొన్ని బిల్లులను పెండింగ్‌లో పెట్టిన విషయాన్ని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో స్పందిస్తూ.. దేశంలో ప్రజాపాలన చాలా బాధాకరంగా సాగుతోందన్నారు. రాజ్యాంగపరమైన ఉన్నత పదవుల్లో ఉన్నవారు.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో రాజకీయ పావులుగా మారినట్లు ఆయన ఆరోపించారు. నాన్ బీజేపీ రాష్ట్రాలను ఓసారి గమనించండి అని, కేంద్రం ఆ రాష్ట్రాలకు సహకరించడం లేదని, ప్రతీకారేచ్ఛతో వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. సహకార సమాఖ్య పాలనకు ఇదేమైనా మోడల్‌గా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. టీమ్ ఇండియా స్ఫూర్తిని దెబ్బతీసేలా కేంద్ర వైఖరి ఉందని, ఇది దేశ ప్రగతికి, సామరస్యానికి ఏ విధంగా దోహదపడుతుందని మంత్రి కేటీఆర్ తన ట్వీట్‌లో అడిగారు.

## బలగం మొగిలయ్యకు అస్వస్థత

### మంత్రుల ఆదేశాలతో హైదరాబాద్‌కు తరలింపు

**హైదరాబాద్,ఏప్రిల్11(వెలుతురు) :** బలగం సినిమాలో క్లైమాక్స్ సాంగ్ తోడుగా మాతో ఉండి అనే పాటను ఆలపించి అందరినీ ఏడిపించిన బుడగజంగాల కళాకారులు పస్తం మొగిలయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మొగిలయ్య ఆరోగ్యంపై రాష్ట్ర మంత్రులు



హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు స్పందించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. మొగిలయ్యను వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించాలని సంబంధిత అధికారులను మంత్రులు ఆదేశించారు. గత కొద్ది రోజుల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మొగిలయ్య.. వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో తన భర్త ప్రాణాలను కాపాడాలని, ప్రభుత్వం ఆదుకోవాలని భార్య కొము రమ్మ వేడుకున్నారు. ప్రస్తుతం మొగిలయ్య ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. అనారోగ్య సమస్యలతో ఇటీవలే ఆస్పత్రిలో చేరిన మొగిలయ్య.. చికిత్స పొందుతూ నానా అవస్థలు పడుతున్నారు. ఓ పక్క కిడ్నీ.. మరో పక్క గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్య సమస్యలకు తోడు ఆర్థిక ఇబ్బందులూ ఆ కుటుంబాన్ని ఊపిరి నలపకుండా చేస్తున్నాయి. కిడ్నీ వ్యాధిన పడ్డ మొగిలయ్యకు ఇప్పటికే కండ్లు కూడా సరిగా కనిపించడం లేదు. 'బలగం' సినిమాలో తన పాటతో కోట్లాది మంది హృదయాలను కదిలించిన మొగిలి –కొమురమ్మ దంపతుల దీనగాథ ఇప్పుడు ప్రతి ఒక్కరి హృదయాలనూ కదిలిస్తోంది.ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

### జయంతి సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాళి

**నిర్మల్,ఏప్రిల్11(ప్రజామంటలు):** పేదప్రజల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే సేవలు మరువలేనివని అటవీ,




పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆశాజ్యోతి, మహిళా విద్యకు మార్గదర్శకుడు, వెనుకబడిన వర్గాల జీవితాల్లో సమూల మార్పుల కోసం జీవితాన్ని ధారపోసిన జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. పూలే ఆశయాలకు అను గుణంగా, ఆయన చూపిన బాటలోనే సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ముందుకుసాగుతున్నదని, రాష్ట్రంలో ఆడబిడ్డల విద్యాభివఅద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాల్లోని బాలికలను విద్యవైపు మళ్లించేందుకు ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలతో పాటు ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలను నెల కొల్పిందని చెప్పారు. దేశం కోసం, సమాజ హితం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కొరకు పోరాటం చేసిన మహా నీయుల విగ్రహాల ఏర్పాటుకు కఅషి చేస్తున్నామని, నిర్మల్ జిల్లా కేంద్రంలో పూలే విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు.

## బోధన్ బిఆర్ఎస్‌లో విభేదాలు

### ఎమ్మెల్యే షకీల్ తీరుపై కౌన్సిలర్ ఆగ్రహం

**బోధన్,ఏప్రిల్11(ప్రజామంటలు):** నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో అధికార పార్టీలో ముసలం ముదిరి పాకాన పడింది. బోధన్ ఎమ్మెల్యే షకీల్ వర్సెస్ మున్సిపల్ కౌన్సిలర్ శరత్ రెడ్డిల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. బోధన్ లో తూము శివమ్మ చారిటబుల్ ట్రస్టు పేరుతో శరత్ రెడ్డి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. చలివేంద్రాలకు సంబంధించిన ఫ్లెక్సీలపై సీఎం కేసీఆర్, కవిత ఫొటోలను పెట్టి ఎమ్మెల్యే షకీల్ ఫొటోలను పెట్టకపోవడంతో మళ్లీ అగ్గిరాజుకుంది. రాత్రికి రాత్రే వాటిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై కౌన్సిలర్ శరత్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే నిన్న మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన షకీల్.. అక్కడ తూము పద్మావతిని ఆహ్వానించక పోవడంతో ప్రొటోకాల్ రగడ షురూ అయింది. షకీల్ వ్యవహారం,పోలీసుల తీరుపై పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమని ఎమ్మెల్యే షకీల్, అనుచరులు చాలా రోజులుగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఏ కార్యక్రమం చేసినా అడ్డుకుంటున్నారన్నారు. ఇప్పటి వరకు తన ఫ్లెక్సీలు ఎక్కడా పెట్టలే దన్నారు పద్మ. తన వార్డులోకి వెళ్లినా.. తనకు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. షకీల్ అండతో పోలీసులు తమని బెదిరిస్తున్నారని.. షకీల్‌పై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

## ఎసిబి వలలో సబ్‌రిజిస్ట్రార్

**పెద్దపల్లి,ఏప్రిల్11(ప్రజామంటలు):** పెద్దపల్లి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ నిర్మల ఏసీబీకి చిక్కారు. సబ్ రిజిస్ట్రార్‌తో పాటు అటెండర్‌ను కూడా పట్టుకున్నారు. డాక్యుమెంట్ల కోసం పూదరి శ్రీనివాస్ నుండి 60 వేల రూపాయలు తీసుకుంటుండగా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ దేవనగిరి నిర్మల, అటెండర్ శ్రీనివాసులను ఏసీబీ డీఎస్పీ భద్ర ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. గతంలో కూడా డాక్యుమెంట్ల కోసం డబ్బు తీసుకుని మరోసారి డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించగా ఇవాళ వలపన్ని పట్టుకున్నారు.

## మహిళపై పెట్రోల్ పోసి నిప్పు

### ఆస్పత్రికి తరలించి పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్,ఏప్రిల్11 (ప్రజామంటలు):** రాజేంద్రనగర్‌లో దారుణం జరి గింది. ఓ మహిళపై దుండగులు పెట్రోల్ పోసి తగలబెట్టి పరార య్యారు. అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 133 వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మహిళ పూర్తిగా కాలిపోయి రోడ్డుపై పడిపోయింది. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు.. మహిళను ఆస్పత్రికి తరలించారు. అయితే తన భర్తే తనను తగలబెట్టాడని బాధితురాలు అంటుంది. భర్త తగులబెట్టాడా? లేక తానే తగులబెట్టుకుందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళను అత్తాపూర్ వాసి శివానీగా పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## పెరుగుతున్న సైబర్ మోసాలు

### క్రెడిట్ కార్డు పేరుతో 20వేలు కొట్టేశారు

**హైదరాబాద్,ఏప్రిల్11(ప్రజామంటలు):** సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎవరూ ఊహించని రీతిలో మోసాలకు పాల్పడు తున్నారు కేటుగాళ్లు. అమాయకమైన ప్రజలను టార్గెట్ చేస్తూ మోసా లకు దిగుతున్నారు. సైబర్ మోసాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పించినప్పటికీ ఏదో ఒక రకమైన మోసాలతో వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కామారెడ్డిలో సైబర్ మోసానికి పాల్పడ్డారు మోస గాళ్లు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన నాగరాజు దగ్గర రూ. 20 వేలు కొట్టేశారు. గత నాలుగు నెలలుగా క్రెడిట్ కార్డు వాడుతున్న నాగారాజుకు అదే బ్యాంకు నుంచి మరో క్రెడిట్ కార్డు వచ్చింది. ఆ క్రెడిట్ కార్డును యాక్టివ్ చేయాలంటూ ఫోన్ చేసి బ్యాంకు అధికారు లమని మాట్లాడుతూ నమ్మబలికారు. దీంతో నాగరాజు వారికి మొబైల్ నెంబర్ తో పాటుగా ఓటీపీని చెప్పాడు. ఓటీపీ చెప్పడమే ఆలస్యం క్రెడిట్ కార్డ్ నుంచి రూ.19,999– వేలు డెబిట్ అయినట్లుగా నాగారాజు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన నాగరాజు కామారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.

## సిగరెట్ తాగుతూ తప్పుగా జాతీయగీతాలాపన

### ఇద్దరు అమ్మాయిన దుష్కృత్యం..పోలీసు కేసు నమోదు

**కోల్‌కతా,ఏప్రిల్11(ప్రజామంటలు):** భారతీయ జాతీయగీతం 'జనగణ మన'ను ఇద్దరు అమ్మాయిలు అపహాస్యం చేశారు. సిగరెట్ తాగుతూ జాతీయ గీతాన్ని పాడి, అగౌరవపరిచారు. కోల్‌కతాకు చెందిన ఇద్దరు అమ్మాయిలు.. చేతిలో సిగరెట్ పట్టుకొని, దాన్ని చూపిస్తూ జాతీయ గీతాన్ని ఆలపించారు. అంతేకాదు అందులోని సాహిత్యాన్ని తప్పుగా పాడుతూ, సిగరెట్ తాగుతూ నవ్వుతూ కనిపించారు. దానికి తోడు ఆ వీడియోను సోషల్ మీడియాలోనూ షేర్ చేశారు. దీంతో ఈ వీడియో వైరల్‌గా మారింది. వీడియో వైరల్ కావడంతో ఈ ఇద్దరు అమ్మాయిలపై నెటిజన్లు తీవ్రంగా మండిపడ్డారు. జాతీయ గీతాన్ని అపహాస్యం చేశారని విమర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే వారిద్దరిపై బరఖ్‌పూర్ సైబర్ సెల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ తర్వాత అమ్మాయిలు ఆ వీడియోను ఫేస్‌బుక్ నుంచి డిలీట్ చేశారు. కేవలం సరదా కోసమే చేశామని. ఈ వీడియో కోసం తమ స్నేహితుడితో పందెం వేశామని, అందుకే ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశామని చెబుతున్నారు. ఇక ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చర్యలు తీసుకునేందుకు సిద్ధమవు తున్నారు. ఈ కేసులో ఇద్దరూ గనక దోషులుగా తేలితే మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చని అంచనా వేస్తున్నారు.

## బండి సంజయ్ కస్టడీ పిటిషన్ డిస్మిస్

**వరంగల్,ఏప్రిల్11(ప్రజామంటలు):** వరంగల్‌లో పదో తరగతి పరీక్ష పేపర్ల లీకేజీ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు డిస్మస్ చేసింది. ఈ పిటీషన్ పై కోర్టులో విచారణ



జరిగింది. కస్టడీ అవసరం లేదని.. ఇప్పటికే పోలీసుల విచారణ పూర్తయ్యిందంటూ బండి సంజయ్ తరపు లాయర్ల వాదనలతో ఏకీభవించింది కోర్టు. దీంతో పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటీషన్ కొట్టివేసింది కోర్టు. కేసులో కుట్ర కోణం లేదని.. కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం లేదని బండి సంజయ్ తరపు లాయర్లు వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే బండి సంజయ్ తోపాటు జైలుకు వెళ్లిన మరో ముగ్గురికి కూడా బెయిల్ మంజూరు చేసింది హనుమకొండ కోర్టు. కొన్ని కండీషన్స్ కింద ఈ ముగ్గురికి బెయిల్ మంజూరైంది. ఆర్డర్ కాపీ రాగానే.. ముగ్గురు నిందితులు కరీంనగర్ జైలు నుంచి విడుదల కానున్నారు. ఈ కేసులో ఏ1గా బండి సంజయ్ ఉన్నారు. టెన్త్ పేపర్ లీక్ కేసులో మొత్తం ఐదుగురు నిందితులుగా ఉన్నారు. బండి సంజయ్ తోపాటు అరెస్ట్ అయిన మరో ముగ్గురిని కలుపుకుంటే.. మొత్తం నలుగురికి బెయిల్ మంజూరైంది. ఒకరు మైనర్‌గా ఉన్నారు. ఆ బాలుడిని ఇంకా అరెస్ట్ చేయలేదు పోలీసులు.

# బి.ఎస్.పి. ఆధ్వర్యంలో పూలే జయంతి

**జనగామ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** బహుజన్ సమాజ్ పార్టీ జనగామ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా మాహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ జనగామ నియోజకవర్గ ఇంచార్జ్



జేరుపోతుల కుమార్ అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జ్ నిర్మాల రత్నం జిల్లా అధ్యక్షులు బస్వగళ్ళ సిద్దయ్య హాజరయ్యారు. జిల్లా ఇన్చార్జి నీర్మాల రత్నం, స్టేషన్ ఘన్ పూర్ ఇన్చార్జి ఇరుగు మహేందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మడిపడిగా చంద్రశేఖర్, జనగామ నియోజకవర్గ అధ్యక్షులు నాగులపల్లి అశోక్, రొడ్డ సుధాకర్, తురకపల్లి కుమార్, గూడూరు రాజు, పిడుగు ఉపేందర్, చేతల అశోక్, తోందురి శ్రీనివాస్, కొంంద్ర మల్లేష్, గడ్డం పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.హెచ్.పి.ఎస్. ఆధ్వర్యంలో మహాత్మా పూలే 196 జయంతి

**వరంగల్ ఏప్రిల్ 11 ( ప్రజామంటలు):** నక్కలగుట్ట హోటల్ హరిత కాకతీయలో మధ్యాహ్నం 1.45 గంటలకు ఎల్.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా



పూలే 196 వ జయంతినీ పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఎల్.హెచ్.పి.ఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి బానోత్ సునీల్ నాయక్, జిల్లా అధ్యక్షులు అజ్మీరా వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు లావుద్య శ్రీను నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల సరళిని పరిశీలించిన కలెక్టర్

**జనగామ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య బచ్చన్నపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జిల్లాలో 10వ తరగతి పరీక్షలు సజావుగా



నిర్వహించేందుకు పక్క ప్రణాళికతో ముందుకు సాగామని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేసి పరీక్షా కేంద్రంలోకి ఇతరులను ఎవరిని అనుమతించకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఈ రోజుతో రెగ్యులర్ పరీక్షలు సజావుగా నిర్వహించామని ఒకేషనల్ పరీక్షలు మిగిలి ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి కే. రాము, సెంటర్ సూపర్డెంట్ సిబ్బంది ఉన్నారు.

### అల్గునూర్ జంక్షన్‌లో

# అంబేద్కర్ కాంస్య విగ్రహం...

**తిమ్మాపూర్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** కరీంనగర్ నగర సుందరీకరణ పనుల్లో భాగంగా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ కూడలిని అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఈ మేరకు అల్గునూర్ జంక్షన్ మానేరు వంతెన వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి కాంస్య విగ్రహం సిద్ధమైంది. త్వరలోనే విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. బంగారు వర్ణంలో చేతిలో భారత రాజ్యాంగంతో సింహాసనంపై ఆసీనుడైన అంబేద్కర్ కాంస్య విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉంది.



# శ్రీ ఆంజనేయ యువజన సంఘం ట్రస్ట్ 93వ వార్షికోత్సవం

**సికింద్రాబాద్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ మోండ మార్కె ట్ డివిజన్ మారుతి వీధి లోని సంజన ప్లే స్కూల్ లో ఆంజనేయ యువజన సేవ సంఘం ట్రస్ట్ బోర్డు 1930 సంవత్సరంలో స్థాపించిన ట్రస్ట్ 93వ సంవత్సర జయంతోత్సవం పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ ..శోభాకృత నామ సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి గురువారం 6 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు హనుమాన్ జయంతి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించామని, తిరిగి చైత్ర శుద్ధి పౌర్ణమి ముందు రోజు వరకు వివిధ రకాల స్వామి వారికి పూజ సేవలు నిర్వహిస్తూ . ఉంటామని ఆయన అన్నారు.. మొదట ధ్వజ ఆరోహణము, ధ్వజ ఊరేగింపు మరియు భజన కార్యక్రమము లో సంఘం సభ్యులు జయ ప్రకాష్ పాల్గొన్నారు. సంజన ప్లే స్కూల్ విద్యార్థులు చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని. తర్వాత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు నోముల శ్యామ్ ప్రకాష్ వారి తల్లి తండ్రుల జ్ఞాపకార్థం బహుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్ సహకారం తో పిల్లలకు అల్పాహారం అందించామని అని తెలిపారు.. 9వ తేదీన ప్రకాష్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజ అర్చన, ప్రత్యేక భజన కార్యక్రమం అనంతరం 200 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. 1930 లో కీర్తి నమగిరి వర్ణరజులు ఆధ్వర్యంలో సత్యనారాయణ, బీదర్ బాబయ్య, నోముల స్వామి రాజు, రామ్ చందర్, అంజయ్య ఎల్లయ్య మరియు ఎంతో మంది కలిసి అంజేనేయస్వామి సంఘం నీ కొనుకొని రిజిస్టర్ చేశారు అని తెలిపారు. ఈ సంఘం పుట్టి 93 సంవత్సరాలు పూర్తి చేసుకుంది అని... అలాగే ప్రస్తుతం ఈ శ్రీ ఆంజనేయ యువజన సంఘం ట్రస్ట్ 11 మంది సభ్యులను ఈ సంఘం ద్వారా వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మన్నారు. ఈ కార్యక్రమంలో



ట్రస్ట్ సభ్యులు సంయుక్త కార్యదర్శి చిట్టి మిళ్ళ నర్సింగరావు, సభ్యులు ర్యాలే జనార్ధన్ యాదవ్, కారింగులు రామ్మోహన్రావు, సామల ప్రకాష్ రావు, జె. విజయ్ కుమార్, లలిత్ మోహన్ రావు, బి.ఎల్. యాజమాన్యం, జయప్రకాష్ సంజన ప్లే స్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బౌద్ధనగర్‌లో జ్యోతిరావు పూలే జయంతి

**సికింద్రాబాద్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మహాత్మ జ్యోతిరావు పూలె 197వ జయంతి సందర్భంగా పూలె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ మేకల సుజాత సారంగపాణి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్, లత. సౌజన్య, దీప్తి,శభానా, మహిళలు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మేకల కీర్తి హర్ష కిరణ్ మాట్లాడుతూ.... సాంఘిక దురాచారాలను అరికట్టి మహిళా అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావడు జ్యోతి రావు పూలె అని మహిళలు చిన్నపిల్లల చదువుల కోసం సొంతగా స్కూల్లను ఏర్పాటు చేసి తన భార్యని మొట్టమొదటి మహిళా విద్యార్థిగా స్కూలుకు పంపించడం జరిగింది. సమాజంలో జరుగుతున్న అసమానతలను తొలగించి అనేక సంస్కరణల పైన రచనలు చేసినా గొప్ప వ్యక్తి పూలే గారు పేద బడుగు బలహీన వర్గాలకు తమ హక్కులను తెలియజేసి చైతన్య




పరిచిన మహానుభావుడు పూలే అడుగుజాడలో మనమందరం నడవాలని మేకల కీర్తి అన్నారు. ఆయన స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని భవిష్యత్తు తరాలకు పూలే సిద్ధాంతాలను ఆశయాలను తెలియజేయాలని మహానుభావునికి ఘనంగా నివాళులు అర్పించారు.

# సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

● **ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

**జగిత్యాల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** పూలే 197వ జయంతి వేడుకలను జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిచైర్మెన్ దావ వసంత సురేష్ అదనపు కలెక్టర్ మకరందు,లైబ్రరీ ఛైర్మెన్ చంద్ర శేకర్ గౌడ్,మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ మరియు బీసీ సంఘం నాయకులతో కలిసి పూలే చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అంటూ పూలే సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.... కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పూలే భావించారన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నాయన్నారు. బలహీన వర్గాలకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందనీ తెలిపారు. వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలు



ఈ అవకాశాలను అందిపుచ్చుకుని విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో మరింతగా ఎదగడమే పూలేకు నిజమైన నివాళు లు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు వివిధ బీసీ కుల సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతి రావ్ పూలే జయంతి

◆ **విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు నోట్ బుక్స్ పంపిణీ**

**జనగామ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మాజీ టీపీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావ్ పూలె జయంతి సందర్భంగా రైల్వేస్టేషన్ వద్ద ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు పెన్నులు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీ పీసీసీ మెంబర్ చెంచరపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసం పల్లి లింగాజీ,ఎన్.ఎస్.యు.ఐ మాజీ జిల్లా అధ్యక్షులు జక్కుల వేణుమాధవ్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లోక్కుంట్ల ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిసర దిలీప్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట సత్యం, జనగామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.డి. మాజీద్ మైనారిటీ జిల్లా నాయకులు జాఫర్ షరీఫ్ జనగామ పట్టణ అధికార ప్రతినిధి వేముల మల్లేష్ వేముల రాజు సలేంద్ర శ్రీనివాస్, సర్వర్ సుల్తాన్ గోవింద్ రెడ్డి, బండారి శ్రీనివాస్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సొడ మహేష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు



రంగు రవి, మోర్తల ప్రభాకర్, కొండ శ్రీను సోషల్ మీడియా కో కన్వీనర్ ఫయాజ్, మహేశ్వరం శ్రీనివాస్, బెజడి హరీష్, దేవర సత్య నారాయణ, ఉల్లెంగుల మధు, కొండ కిరణ్, కందుల రాజు, పులిగిల్ల శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.

# పంచాయితీ కార్యదర్శుల ఆత్మీయ సమావేశం

**జగిత్యాల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జగిత్యాల నియోజకవర్గ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరి 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలవగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. అనంతరం ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, పచ్చదనం, పరిశుభ్రత కాపాడాలని, పల్లెలే దేశానికి పట్టు కొమ్మల వంటివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతోత్సవం

**హుజురాబాద్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని జమ్మికుంట రోడ్ లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త, స్ఫూర్తిప్రదాత మహాత్మా



జ్యోతిబా పూలే గారి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, జయంతోత్సవ చైర్మన్ బుర్ర కుమార్, ప్రధాన కార్యదర్శి ఉప్పు శ్రీనివాస పటేల్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొల్లిపాక నిర్మల శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, పాల కిషన్, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్ రావు, జయంతి ఉత్సవ కార్యవర్గ సభ్యులు పాక సతీష్, ఖలీద్, సొల్లు బాబు, ఎర్రబోజు నారాయణ, కొలిపాక సమ్మయ్య, తాటిపాముల రాము, జలీల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఐదుగురు నిరు పేద కుటుంబాలకు

# నిత్యవసర సరుకులు పంపిణీ

**జనగామ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మహిళా శిశు దివ్యాంగుల , వయోవృద్ధుల సంక్షేమ శాఖ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆద్వర్యంలో గుర్తించిన నిరు పేదలైన ఐదుగురు కుటుంబాలకు, కస్తూర్బా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్ హైదరాబాద్ సహకారంతో జిల్లా సంక్షేమ అధికారిని శ్రీమతి జయంతి,



బచ్పన్ బచావో ఆందోళన రాష్ట్ర కోఆర్డినేటర్ అందె వెంకటేశ్వర్లు ఐదుగురు నిరు పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం జనగామ లోకల్ లో ఉన్న రాజరాజేశ్వరి ఓల్డ్ ఏజ్ హోమ్, సీతారాంపురం గ్రామం దేవరుప్పుల మండల్ లో ఉన్న ప్రేమసదనం ఓల్డ్ ఏజ్ హోమ్ కు మూడు క్వింటాల రైస్ అందజేశారు. జిల్లా సంక్షేమ అధికారిని శ్రీమతి జయంతి మాట్లాడుతూ మహిళా, పిల్లల, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ వారిచే ఎర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 14567 సంప్రదించగలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ ఉప్పలయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎల్.రవికాంత్, ఫీల్డ్ రిసోర్స్ ఆఫీసర్ సి.హెచ్. రాజు, సోషల్ వర్కర్ ప్రణయ్, హెూం నిర్వాహకులు పాల్గొన్నారు.

# కోవిడ్ కష్టకాలంలో పనిచేస్తే ప్రతిఫలం ఇదా..? అంటూ ఆవేదన

**గాంధీ దవాఖాన ఎదుట కోవిడ్ పేషంట్ కేర్ సిబ్బంది ఆందోళన**

**తిరిగి డ్యూటీల్లోకి తీసుకోవాలని వేడుకోలు**

**సికింద్రాబాద్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** కోవిడ్ పాండమిక్ లో 2020 లో కోవిడ్ నోడల్ కేంద్రం గాంధీ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ కింద నియమించబడిన 244 మంది కోవిడ్-19 పేషంట్ కేర్ సిబ్బందిని గత 10 రోజుల క్రితం



తొలగించడతో వారు ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో వీరంతా మంగళవారం గాంధీ ఆసుపత్రి మెయిన్ గేట్ వద్ద నున్న భారీ గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు. కష్టకాలంలో ప్రాణాలు తెగించి తాము కరోనా పేషంట్లకు సేవలు చేస్తే, 3 ఏండ్ల తర్వాత ఇప్పుడు అవసరం లేదంటూ విధుల్లో నుంచి తమను తొలగించడం అన్యాయమని వారు వాపోయారు. ఉపాధి లేక తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, సీఎం కేసీఆర్, వైద్య శాఖ మంత్రి హరీష్ రావు దయతలంచి, తమకు తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు వేడుకున్నారు. లేకపోతే తమకు చావే గతి అని వారు తమ బాధను వ్యక్తం చేశారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**సికింద్రాబాద్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మహాత్మ జ్యోతిరావు పూలే 197 జయంతి సందర్భంగా సిటీలో పలు చోట్ల ఘనంగా కార్యక్రమాలను



నిర్వహించారు. రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆలిండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ ఉద్యమ నాయకుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ఈసందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. నేటి సమాజానికి జ్యోతి రావు పూలే ఆదర్శనీయమన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ మంజూరి కొరకు మీసేవ ద్వారా దరఖాస్తుకై 17 ఏప్రిల్ వరకు అనుమతి

**కలెక్టర్ ఎస్.కే. యాస్మిన్ భాషా**

**జగిత్యాల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ గృహముల మంజూరుకై జగిత్యాల మున్సిపల్ పరిధిలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ ఐ.డి కార్డు, బ్యాంకు ఖాతా కలిగి ఉండి ఎలాంటి గృహములు, ఆస్తులు లేకుండా నిరుపేదలై అర్హులుగా ఉన్న వారికి డబుల్ బెడ్ రూమ్ మంజూరి కొరకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు తేదీ: 12.04.2023 నుండి అనుమతి ఇవ్వడం జరిగినది. కావున ఇట్టి సదుపాయం తేదీ: 12.04.2023 నుండి 17.04.2023 వరకు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకొనగలరని ఇట్టి సదుపాయమును జగిత్యాల ప్రజలు సద్వినియోగం చేసుకొనగలరని జిల్లా కలెక్టర్ ఎస్.కే. యాస్మిన్ భాషా ఒక ప్రకటనలో తెలిపినారు.



## అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే

**జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత**

**జగిత్యాల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జెడ్పీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని వారి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేశ్. ఈ





సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ.... కులం పేరుతో తరతరాలుగా, అన్నిరకాలుగా అణచివేతకుగురెట్కన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు. అతను భారతదేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా కోట్లాది ప్రజానీకం కోసం, పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం పోరాడిన మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాలను ఆచరణలో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామానుజన్ చార్యులు, మరియు జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతీరావు పూలే జయంతి

**సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగులు.**

**కాగజ్ నగర్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** నేడు జ్యోతీరావు పూలే జయంతి పురస్కరించుకుని కోసిని గ్రామ శివారు లో గల పూలే దంపతుల విగ్రహాలకు



పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన విశ్రాంత ఉద్యోగులు మరియు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామ ప్రజలు ఈసందర్భంగా సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ.... వారి సేవలు కొనియాడారు, విశ్రాంత ఉద్యోగుల అధ్యక్ష కార్యదర్శులు జయదేవ్, శివప్రసాద్, రాజయ్య, బి.నర్సయ్య, ఈఎస్ఐ వెంకటి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

**హుజురాబాద్ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మండలం లోని ఐదు పరీక్ష కేంద్రాలలో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ముగిసినట్లు మండల విద్యాధికారి కేతిరి వెంకట నర్సింహా రెడ్డి తెలిపారు. హుజురాబాద్ పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 రెగ్యులర్ విద్యార్థులకు 199 హాజరవగా 1



గైర్హాజరయ్యారు. 13 మంది ప్రైవేట్ (వన్స్ ఫెయిల్డ్) విద్యార్థుల్లో తెలుగు పరీక్ష ముగ్గురికి ఒక్కరే హాజరవగా, హిందీ, ఆంగ్లం, సాంఘిక పరీక్షలకు ఒక్కరికి ఒక్కరు రాగా, గణిత పరీక్షకి ఎనిమిది మందికి ఎనిమిది వచ్చారు. సైన్స్ పరీక్షకి తొమ్మిది మందికి ముగ్గురు హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 178 మందికి 178 హాజరయ్యారు, న్యూ శాతవాహన లో 163 విద్యార్థులకు 163 హాజరయ్యారు. మాంటిసోరి లో 158 కి 156 విద్యార్థులు, చెల్పూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 కి 199 హాజరయ్యారని ఆయన తెలిపారు.

## జిల్లా బి.సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో.... జ్యోతిరావు పూలే జయంతి

**జగిత్యాల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బి.సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో జరిగిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే 197 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని మంగళవారం పూలే జయంతి వేడుకలను పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పూలే ఫోటోకి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అంటూ పూలే సేవలను గుర్తు చేసుకున్నారు. కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పూలే భావించారన్నారు. అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. మహిళలు చదువుకుంటేనే అసమానతలు తొలగిపోతాయని భావించి మొదట తన భార్య సావిత్రీబాయిని విద్యావంతురాలిని చేసిన గొప్ప ఆచరణ వాది అని కొనియాడారు. సమాజ పునర్నిర్మాణానికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, బి.సి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు, కన్వీనర్ కొక్కు గంగాధర్,



బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, కన్వీనర్ చింతల గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, బి.సి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, కన్వీనర్ జాజాల రమేష్, బి.సి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీలకు అండగా నిలుస్తున్న సామాజిక సేవకులు మహమ్మద్ యాకుబ్ పాషా

**జనగామ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** హం సాత్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో జనగామ అంబేద్కర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ యాకుబ్ పాషా హోటల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న వీరికి ఇద్దరు కుమారులు, పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్న ఐదేళ్ల చిన్నారి పర్వీనా బేగం ఉండగా హాస్పిటల్లో చూపించే ఆర్థిక స్తోమత లేక దాతల కోసం ఎదురుచూస్తున్న, ఈ పేద కుటుంబానికి నెలకు సరిపడే నిత్యవసర వస్తువులు అందించి మరోసారి ఔదార్యం చాటుకున్నారు. జనగామ సామాజిక సేవకులు మహమ్మద్ యాకుబ్ పాషా. ఈ పవిత్ర రంజాన్ మాసంలో పేద మధ్యతరగతి ముస్లిం కుటుంబాలను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించాలని, అలాగే దాతలు ముందుకు వచ్చి అంగవైకల్యంతో బాధపడుతున్న పర్వీనా బేగం వైద్య ఖర్చుకై ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కుటుంబానికి సహాయం చేయాలనుకునేవారు ఫోన్ 8106198974 నెంబర్ లో సంప్రదించి పాపను ఆదుకోవాలని ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారు.



## గోవుల సంరక్షణతోనే రైతుల మనుగడ

**వేలేరు ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** గోవులను సంరక్షిస్తేనే భవిష్యత్‌లో రైతుల మనుగడ సాధ్యమవుతుందని, తద్వారా దేశం సుభిక్షంగా ఉంటుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. మంగళవారం వేలేరు మండలంలోని పీచర గ్రామంలో శ్రీలక్ష్మి గోశాల ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కొడెదూడెలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సేంద్రియ వ్యవసాయం వల్ల ఆరోగ్యకర సమాజం తయారవుతుందన్నారు. రైతులు గోవులను పెంచడం వలన వాటి నుండి వచ్చే పేడ, మూత్రం ద్వారా సేంద్రీయ పద్ధతిలో పంటలు పండించుకుని అధికమైన దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఫెస్టిసైడ్స్ వాడడం వలన భూసారం దెబ్బతిని రానున్న భవిష్యత్ తరాలకు విషపూరితమైన నేలను అందించిన వారమవుతామని అన్నారు. అనంతరం 10 మంది రైతులకు 20 కొడెదూడలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గోశాల ప్రదర్శన రాష్ట్ర అధ్యక్షులు గాడిపల్లి రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ దుర్గం రోజా, జాడి పవన్ కుమార్ . ఎంపీటీసీ జల్తారి సంపత్, గోశాల ప్రతినిధులు రామంచ సుధాకర్, లక్ష్మి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## జ్యోతిబా పూలే జయంతి

● **రోగులకు పండ్లు పంపిణీ...**

**జనగామ ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మహాత్మా జ్యోతిబా పూలే 197 వ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో 100 మంది రోగులకు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఇంచార్జి డాక్టర్ తాళ్లపెల్లి వెంకటస్వామి మాట్లాడుతూ.... బహుజనుల అభ్యున్నతి కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు, బహుజనులను విద్యావంతులుగా చేయడం కోసం బరోడా మహారాజునే ఒప్పించి ఉచిత విద్యా, వైద్య సదుపాయాలు కల్పించిన మహనీయుడు అని తెలిపారు. ఆశయాలను, సంస్కారణలను ఇప్పుడున్న ప్రభుత్వాలు తుంగలో తొక్కి విద్య, వైద్యాన్ని ప్రైవేటీకరణ చేసి బహుజనుల జీవితాలను నాశనం చేసారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర మైనారిటీమాజీ కన్వీనర్, డాక్టర్ స్టీఫెన్ అరికిల్ల, సీనియర్ నాయకులు నల్ల రమేష్ , గాదె అశోక్ , ఎస్ ఎస్ యు జిల్లా ఇంచార్జ్ మాదారపు విజయ్,



నియోజకవర్గ అధ్యక్షులు మొకేనాపెళ్ళి చక్రపాణి, జీడి యాకోబు, బివిఎఫ్,ఎస్ ఎస్ యు నాయకులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి వయా జన్నారం మీదుగా హైదరాబాద్‌కు బస్

**మెట్ పల్లి ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** మెట్ పల్లి నుంచి ఖానాపూర్, కడెం, లక్షెట్టిపేట, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వరకు నేడు నూతన బస్సు సర్వీసును కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ప్రారంభిస్తున్నట్లు మెట్ పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ వేదవతి తెలిపారు. ఈ బస్సు మెట్ పల్లి నుంచి ప్రతిరోజు సాయంత్రం 6:45 కు ప్రారంభమై కడెం వద్ద 20 నిమిషాల పాటు ఆగుతుందని, మళ్ళీ రాత్రి 8: 15 నిమిషాలకు బస్ బయలుదేరుతుందని, మర్నాడు తెల్లవారుజామున 4 గంటలకు హైదరాబాద్ కు చేరుకుంటుందని, మళ్లీ రాత్రి 10 గంటలకు హైదరాబాదులో ప్రారంభమై మర్నాడు ఉదయం 6 గంటలకు కడెం చేరుకుని, అక్కడి నుంచి సుమారు 7:05కి మెట్ పల్లి కి వస్తుందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## జిల్లా గ్రంధాలయంలో జ్యోతిబా పూలే జయంతి

**జగిత్యాల ఏప్రిల్ 11 (ప్రజామంటలు):** జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యాలయంలో 197వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ డా. గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్. చైర్మన్ మాట్లాడుతూ....మరి ఆ రోజుల్లో వారు అంటరానితనాన్ని



నిర్మూలన చేసి, ప్రతి వ్యక్తి మనిషి అనేవారు సమాన హక్కులు ఉంటాయని, సమాన హక్కుల భాగంగానే అంటరానితనాన్ని నిర్మూలించాలని, ప్రతి వ్యక్తి కూడా చదువుకోవాలని వారి ఉద్దేశం,ఆ చదువు జ్ఞానాన్ని,విజ్ఞానాన్ని సంపాదిస్తుంది, కాబట్టి ప్రతి వ్యక్తి చదువుకోవాలని చెప్పి ఆయన కంకణం కట్టుకుని అంటరాని వారిని చదివించడం జరిగింది. బాల్య వివాహాలకు అడ్డుకట్టు వేసిన మహానుభావుడు మన మహాత్మ జ్యోతిబా పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ శకుంతల, అటెండర్లు రాజు అనిల్, విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు కోసం జగన్ నిర్మాణాత్మక ప్రతిపాదనలు

**ప్రధాని మోడీతో కూడా ప్రతిపాదన చేశారు**

**సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి**

**అమరావతి,ఏప్రిల్11(ప్రజామంటలు):** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కోసం సీఎం జగన్ నిర్మాణాత్మక ప్రతిపాదనలు చేశారని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని మోదీతో కూడా చాలాసార్లు మాట్లాడారని, జగన్ ప్రతిపాదనలనే ఇవాళ కేటీఆర్ కూడా చెప్పారని సజ్జల అన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బిడ్డింగ్‌లో తెలంగాణ పాల్గొనబోతుందా అని ఆయన ప్రశ్నించారు. తాము స్టీల్ ప్లాంట్ వయబులిటీ గురించే ఆలోచిస్తున్నామని, స్టీల్ ఎ÷-లాంట్ టెండర్‌లో చాలా పరిమితులు ఉన్నాయని, విశాఖ స్టీల్ఎ÷-లాంట్ తెలుగు ప్రజల సెంటిమెంట్ అని సజ్జల అన్నారు. సంక్షేమ పథకాలను విపక్షాలు ఓర్చుకోలేకపోతున్నాయని, స్టీల్ ప్లాంట్‌పై విపక్షాలు అసత్యప్రచారం చేస్తున్నాయని సజ్జల ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాలని తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్వహణకు మూలధన సేకరణలో భాగంగా ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించిన నేపథ్యంలో.. దాని బిడ్డింగ్‌లో పాల్గొనాలని నిశ్చయించింది. బిడ్డింగ్‌ను దక్కించుకోగలిగితే ఇటు పాలనాపరంగా.. అటు రాజకీయంగా కేంద్రంలోని బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టినట్లవుతుందని.. ప్రైవేటీకరణను అడ్డుకున్నామని రెండు తెలుగు రాష్ట్రాల్లోనే గాక దేశమంతా మైలేజీ వస్తుందని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గత నెల 27న ఈవోఐ విడుదల అయింది. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం వరకు ఆసక్తిగల కంపెనీలు బిడ్లు దాఖలు చేయవచ్చు. ఈవోఐ బిడ్లలో ప్రభుత్వాలు నేరుగా పాల్గొనేందుకు వీల్లేదు. కంపెనీలు మాత్రమే పాల్గొనాలి. ఈ నేపథ్యంలో.. తెలంగాణ సర్కారుకు సింహభాగం వాటా ఉన్న సింగరేణి సంస్థను రంగంలోకి దించాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో.. ఒకట్రెండు రోజుల్లో అధికారుల బృందం ఒకటి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు వెళ్లి, అధ్యయనం చేయనుంది.

## చైతన్యరథం పత్రికపై అక్కసు

**సిఐడి నోటీసులపై మండిపడ్డ పత్తిపాటి**

**ఏలూరు,ఏప్రిల్11(ప్రజామంటలు):** చైతన్య రథం పత్రిక కేంద్ర కార్యాలయానికి సీఐడీ అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావుఅన్నారు. చైతన్య రథం పత్రికలో ఎక్కడ అసత్య ప్రచారం చెయ్యడం లేదన్నారు. సీఐడి అధికారులు సాక్షి పేపర్, జగన్ యూట్యూబ్ చానళ్ళకు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ పాదయాత్రలో టీడీపీ అధినేత చంద్రబాబు పై చేసిన వ్యాఖ్యలను జనం మరిచిపోలేదన్నారు. సీఎం జగన్ అరాచకాలను, దోపిడీలను యువగళం పాదయాత్రలో లోకేష్ (ఒనీ।బఠ) ప్రశ్నిస్తే నోటీసులు ఇస్తున్నారని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో వైసీపీ దోపిడీలను సాక్ష్యాలతో సహా ప్రజలు బయటపెడుతున్నారని విమర్శించారు. ఈ నెల 14 న నూజివీడులో చంద్రబాబు సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఐదు నియోజకవర్గాల నుంచి ప్రజలు చంద్రబాబు సభకు తరలి వెళ్ళనున్నారని తెలిపారు. సీఎం జగన్ను ఎప్పుడు గద్దె దింపుదామాని ప్రజలు ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించారు.

## టీడీపీ కేంద్ర కార్యాయానికి సీఐడీ నోటీసులు

**చైతన్య రథంలో వస్తున్న వార్త కథనాలపై ఆరా**

**అమరావతి,ఏప్రిల్11(ప్రజామంటలు):** టీడీపీ కేంద్ర కార్యాయానికి సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం టీడీపీ కార్యాలయానికి వచ్చిన సీఐడీ అధికారులు టీడీపీ జనరల్ సెక్రటరీ పేరుతో నోటీసులు ఇచ్చి వెళ్లారు. పార్టీ అనుబంధ పత్రిక చైతన్య రథంలో వస్తున్న వార్త కథనాలపై సీఐడీ వివరాలు సేకరించింది. ఇంతకు చైతన్య రథం పత్రిక ఎడిటర్ ఎవరు.. నిర్వహణ ఎవరు చూస్తున్నారు అంటూ ప్రశ్నలు వేశారు. లాయర్ చేతికి నోటీసులు అందజేసి సీఐడీ అధికారులు వెళ్లిపోయారు. కాగా... చైతన్య రథం పేరుతో టీడీపీ డిజిటల్ మ్యాగజైన్‌ను నడుపుతోంది. రోజూ దాదాపు 24 పేజీలతో వచ్చే ఈ మ్యాగజైన్‌లో టీడీపీకి సంబంధించిన వార్తా విశేషాలను ఇస్తారు. అలాగే అధికారపక్షం చేస్తున్న అక్రమాల వ్యవహారాలపై మ్యాగజైన్‌లో కథనాలు ప్రచురిస్తారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురించి అపరిచితుడు అనే శీర్షికతో బుగ్గన భూదాహం అనే ఉపశీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. ఇందులో బుగ్గన ఆస్తులపై ప్రచురించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్ల సమయంలో రిటర్నింగ్ అధికారికి ఇచ్చిన అఫిడవిట్‌ను తీసుకుని ఆస్తులపై కథనం ప్రచురించారంటూ చైతన్య రథంపై కేసు నమోదు చేశారు. మంత్రి బుగ్గన అప్రతిష్ట కలిగించే విధంగా, గౌరవ మర్యాదలకు భంగం కలిగించారంటూ సెక్షన్ల నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఈరోజు టీడీపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న సీఐడీ అధికారులు సీఆర్పీసీలోని సెక్షన్ 91 కింద నోటీసులు ఇచ్చారు. చైతన్య రథం పత్రిక ఎడిటర్ ఎవరు.. నిర్వహణ ఎవరు చూస్తున్నారు అని.. అలాగే అపరిచుతుడు అనే పేరుతో ఈ కథనాన్ని రాసిన రిపోర్టర్ ఎవరు అని, చైతన్య రథం డిజిటల్ మ్యాగజైన్‌కు సంబంధించి ఒరిజనల్ కాపీ అందజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మూడు నెలల క్రితమే శీర్షికపై కేసు నమోదు చేసినప్పటికీ ఈరోజు నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యమేంటి అంటూ టీడీపీ వర్గాలు ఆరా తీస్తున్నాయి.

# పవన్ సరసన ప్రియాంక అరుల్ మోహన్





హీరోయిన్ ప్రియాంక ఆరుళ్ మోహన్‌కు టాలీవుడ్‌లో భారీ అఫర్ దక్కిందనే వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఏకంగా పవన్ కళ్యాణ్ సరసన నటించే ఛాన్స్ కొట్టేసింది. పవన్‌కల్యాణ్ హీరోగా, సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి డి.వి.వి దానయ్య నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ వారంలో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మొదలువుతుందని చిత్ర బృందం నుంచి సమాచారం. ప్రస్తుతం పవన్‌కల్యాణ్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. మరోవైపు సముద్రఖని దర్శకత్వంలో 'వినోదాయ సీతం' రీమేక్‌లో నటిస్తున్నారు. ఇందులో సాయిధరమ్ తేజ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. నాని 'గ్యాంగ్‌లీడర్', 'శ్రీకారం చిత్రాలలో తన నటనతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించారు ప్రియాంక. అయితే ఈ రెండు చిత్రాలు అంతగా ప్రేక్షకాదరణ పొందలేదు. ఆ తర్వాత ఆమెకు సరైన అవకాశమూ రాలేదు. ఇప్పుడు జాక్‌పాట్ కొట్టినట్లు ఓ పెద్ద ఆఫర్ ఆమె చేతిలో పడినట్లు తెలిసింది. పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని మొదలుపెట్టారు, ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ సరనసన నటించేందుకు కథానాయక దొరికిందనే వార్త నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఒజి చిత్రం కోసం కథానాయికగా ప్రియాంకను దర్శకుడు సుజీత్ ఎంపిక చేశారట. టాలీవుడ్‌లో ఆమెకు దక్కిన పెద్ద అవకాశమిది. ఇప్పటి వరకూ ఆమె నటించిన తెలుగు, తమిళ చిత్రాల్లో ఎక్కువగా పక్కింటి అమ్మాయి పాత్రల్లోనే కనిపించారు. 'గ్యాంగ్‌స్టర్' కథతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రియాంక పాత్ర ఎలా ఉండబోతుందో చూడాలి.

### 14న విడుదలవుతున్న

# శాకుంతలం



హీరోయిన్ సమంత లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం శాకుంతలం పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గుణశేఖర్ దర్శకత్వం వహిస్తున్నాడు. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో సెన్సార్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతోపాటు సినిమా నిడివి ఎంతో తెలిసిపోయింది. తాజా అప్‌డేట్ ప్రకారం శాకుంతలం రన్‌టైం 142 నిమిషాలు అంటే.. 2 గంటల 22 నిమిషాలుగా వచ్చింది. ఈ చిత్రంలో మలయాళ యాక్టర్ దేవ్ మోహన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. దేవ్ మోహన్ దుష్యంతుడి పాత్రలో నటిస్తున్నాడు. పాన్ ఇండియా కథాంశంతో వస్తోన్న ఈ మూవీలో అనన్య నాగళ్ల, అదితీ మోహన్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని గుణ టీమ్ వర్క్స్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. శాకుంతలం ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన శాకుంతలం టీజర్, ట్రైలర్‌తోపాటు పాటలకు మంచి స్పందన వస్తోంది. సమంత ఈ చిత్రంలో పురు రాజవంశపు రాణి కావ్య నాయకి శకుంతల దేవి (ఐజీలాజీ ఔజాజీతి ÷ూరజీబీనిబిజ్జీ÷జీ ఆ।లతి) గా అలరించేందుకు రెడీ అవుతోంది. శాకుంతలం ఏప్రిల్ 14న థియేటర్లలో సందడి చేయనుంది.

# కిసీకా భాయ్.కిసీకా జాన్

### ఆసక్తి కలిగిస్తున్న ట్రైలర్

బలీవుడ్ స్టార్ సల్మాన్‌ను గత రెండేళ్లుగా వరుస ప్లాపులు ఇబ్బంది పెడుతున్నాయి. నిజానికి గతేడాది సల్మాన్ నుండి ఒక్క సినిమా కూడా రాలేదు. ఆ ముందటి ఏడాది రెండు సినిమాలు విడుదల కాగా.. రెండూ నిర్మాతలకు తేరుకోని నష్టాల్ని మిగిల్చాయి. దాంతో సల్మాన్ కొంచెం గ్యాప్ తీసుకుని రెండు సినిమాలతో అభిమానులలో ఉత్సాహం నింపడానికి రెడీ అయ్యాడు. సల్మాన్ ప్రస్తుతం రెండు సినిమాలు సెట్స్‌మీద ఉంచాడు. అందులో 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' ఒకటి. ఈద్ సందర్భంగా ఈ మూవీ రిలీజ్ కానుంది. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, పాటలకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా ట్రైలర్ ను రిలీజ్ చేశారు. లేటెస్ట్ గా రిలీజైన ట్రైలర్ ఆసక్తిని రేకెత్తిస్తుంది. ట్రైలర్ తోనే సినిమాపై కొంత క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. వైలెన్స్ కు దగ్గరగా ఉండే హీరో, వైలెన్స్ అంటే పడని హీరోయిన్ అన్నయ్య. ప్రేమించిన అమ్మాయి కోసం హీరోయిన్ అన్నయ్యను ఇంప్రెస్ చేయడం. అప్పుడే హీరోయిన్ ఫ్యామిలీను చంపాలని చూసే విలన్. వాళ్లని హీరో ఎలా అడ్డుకున్నాడు. వైలెన్స్ నచ్చని హీరోయిన్ అన్నయ్య.. హీరోను ఇష్టపడ్డాడా? అనేది కథ. హీరోయిన్ అన్నయ్యగా వెంకటేష్, ఆయన భార్యగా భూమిక నటించింది. ప్రతినాయకుడి పాత్రలో జగపతిబాబు నటించాడు. ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన వీరమ్ సినిమాకు రీమేక్. ఇదే సినిమాను పవన్ కళ్యాణ్ కాటమరాయుడుగా రీమేక్ చేశాడు.ట్రైలర్ ను గమనిస్తే కథలో చాలా మార్పులు చేసినట్లు తెలుస్తుంది. తమిళంలో హీరోయిన్ ఫాదర్ పాత్రను హిందీలో అన్నయ్యగా మార్పు చేశారు. యాక్షన్ సీన్స్ కూడా పుష్కలంగా దట్టించినట్లు స్పష్టం అవుతుంది. అయితే కొన్ని యాక్షన్ సీన్స్ మాత్రం మితిమీరినట్లు తెలుస్తుంది. ఒక్క గుద్దుకే బిల్డింగ్ పడిపోవడం, ట్రైన్ లో ÷ట్ సీన్ కాస్త అతిగా అనిపించింది. అయితే సల్మాన్ అభిమానులకు మాత్రం ఈ సినిమా పండగలానే కనిస్తుంది. సల్మాన్ ఈ సినిమాను స్వంత బ్యానర్లో నిర్మించాడు.






### బిచ్చగాడు-2 నుంచి

# నేడు పాట విడుదల

ఏడేళ్ల క్రితం విడుదలైన బిచ్చగాడు ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎలాంటి ప్రమోషన్లు లేకుండానే ఈ సినిమా టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించింది. తమిళంలో కంటే తెలుగులోనే ఈ సినిమాకు ఎక్కువ కలెక్షన్లు రావడం గమనార్హం. ఇక ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కుతుంది. ఇప్పటికే రిలీజైన స్నీక్ పీక్ వీడియో, థీమ్ సాంగ్ ఈ సీక్వెల్ పై ఎక్కడలేని అంచనాలు క్రియేట్ చేశాయి. బ్రెయిన్ ట్రాన్స్ ప్లంటేషన్ అనే డిఫరెంట్ కాన్సెప్ట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అటు తమిళనాట, ఇటు తెలుగులో మంచి హైపే ఉంది. మరో మూడు రోజుల్లో ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ క్రమంలో మేకర్స్ వరుస అప్డేట్ లను ప్రకటిస్తూ సినిమాపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమాలోని మ్యూజికల్ అప్డేట్ ను ప్రకటించారు. ఈ మూవీలోని చెల్లి వినవే అంటూ సాగే ఎమోషనల్ సాంగ్ ను బుధవారం సాయంత్రం 4గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు పోస్టర్ ను విడుదల చేశారు. ఈ పోస్టర్ లో చేతిపై రాణి పాప అని రాసుంది. చెయి పక్కన గ్రద్ద కూడా ఉంది. పోస్టర్ తోనే సాంగ్ పై ఆసక్తిని క్రియేట్ చేశారు. విజయ్ ఆంటోని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ కు జోడీగా కావ్యా థాపర్ నటిస్తుంది. కాగా మరో మూడు రోజుల్లో విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటివరకు ఎలాంటి ప్రమోషన్లు చేయలేదు. మరి ఈ సినిమా అదే రోజున విడుదలవుతుందా లేదా అనేది క్లారిటీ రావాల్సి ఉంది.

# విరూపాక్ష ట్రైలర్ విడుదల

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'విరూపాక్ష సంయుక్తా మీనన్ కథానాయిక. కార్తిక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. మంగళవారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. గ్రామీణ వాతావరణాన్ని చూపిస్తూ ప్రారంభమైన ఈ ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. 'ఊరిలో జరుగుతున్న చావులకు కారణం తెలుసుకుని తీరతాను, సమస్యకు పరిష్కారం నేను వెతుకుతాను' అంటూ సాయితేజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంటున్నాయి. 'గ్రహణం నీడ పట్టి విడిచే లోపు ఊరు అంతం అయిపోతుంది...గుడిని, ఊరిని అష్టదిగ్బంధనంతో మూసేయాలి'..రుద్రవనాన్ని కాపాడే విరూపాక్షవి నువ్వే అంటూ సాగే డైలాగ్‌లు అలరించేలా ఉన్నాయి. ఉత్కంఠగా సాగే మిస్టరీ థ్రిల్లర్‌లా అనిపిస్తుంది. సునీల్, సాయిచంద్, అజయ్ పాత్రలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా ఉంది. ఈ నెల 21న ఈ చిత్రం విడుదల కానుంది.



# తండ్రీ కొడుకు పాత్రల్లో

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మరో క్రేజీ మూవీ మహేష్ 28. ఈ చిత్రానికి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నారు. హెూల్‌సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణలో ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ చిత్రంలో మహేష్ బాబు ద్విపాత్రాభినయం చేస్తున్నారనేది ఈ వార్తల సారాంశం. తండ్రీ కొడుకులుగా మహేష్ రెండు క్యారెక్టర్స్‌లో కనిపిస్తారని సమాచారం. గతంలో 'నాని' సినిమాలో మహేష్ ఇలా తండ్రీ కొడుకుల పాత్రలను పోషించారు. ఇన్నాళ్లకు మరోసారి ఆయన ఈ తరహా ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల నాయికలుగా నటిస్తున్నారు. పీడీవీ ప్రసాద్ సమర్పణలో హారికా హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. థమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.



# నాగచైతన్య కస్టడీ విడుదలకు రెడీ



నాగచైతన్య హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కస్టడీ'. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. కృతీశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. అరవింద్ స్వామి విలన్ పాత్రలో నటిస్తుండగా, ప్రియమణి పవర్ ఫుల్ క్యారెక్టర్ చేస్తోంది. నాగచైతన్య పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ మూవీ నుండి 'హెడ్ అప్ హై' అనే సాంగ్‌ను విడుదల చేశారు.ఇళయరాజా, యువన్ శంకర్ రాజా కంపోజ్ చేశారు. 'సేఫ్టీ, సెక్యూరిటీకి సింబల్ ఈ ఖాకీరా, మఫ్టీలో ఉన్నా.. మన పవరే పటాకీ, డ్యూటీలో రౌండ్ ద క్లాక్ ఫుల్ చలాకీరా, ఈ లాఠీతో జర్నీ చేసే లైఫ్ ఎంతో లక్కీరా' అంటూ పోలీసుల గురించి ఈ పాటలో రాశారు రామజోగయ్య శాస్త్రి. యువన్ శంకర్ రాజా, అరుణ్ కౌండిన్య, అసల్ కోలర్ పాడారు. పోలీస్ స్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో నాగచైతన్యపై చిత్రీకరించిన ఈ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు. సంపత్ రాజ్, శరత్ కుమార్, ప్రేమ్ జీ, వెన్నెల కిషోర్, ప్రేమి విశ్వనాథ్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మే 12న సినిమా విడుదల కానుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com